# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 7-12-2025  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :32  సంచిక:98  పేజీలు:6  వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

పేరెంట్సుతో ముఖాముఖి
పారగుడై నిర్వహించి ప్రజ్ఞానిధులన్
నేరుగ నుత్సాహపరచె
నారా కుల చంద్రబాబు నాయుడు విదుడై

(ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరెంట్సుతో ముఖాముఖి నిర్వహించి విద్యార్థుల నుత్సాహపరచారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



**చురక**

ప్రతీసారి తన విలువ
పతనమౌతూ రూపాయి
పోటీపడుతూ డాలర్ తో
పరుగెత్తని సిపాయి
ఆర్థికంగా మనదేశం
అద్భుతంగా అభివృద్ధి
ఐతే ఎలా జర్గుతుంది
ఆగకుండా దేహశుద్ధి

-వేల్పుల నారాయణ
9440433475



# తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోంది

## -సీఎం రేవంత్‌రెడ్డి



నల్గొండ, డిసెంబర్ 6:తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు.

కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు. పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇవాళ (శనివారం) నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి.

'కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్.. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా.. అయిన.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగిందని.. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# డివైడర్‌ను ఢీకొట్టి మంటల్లో చిక్కుకున్న కారు.. సజీవ దహనమైన పోలీస్ అధికారి



బెంగళూరు, డిసెంబర్ 6: పోలీస్ అధికారి డ్రైవ్ చేస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో మంటలు అంటుకున్నాయి. ఆ కారులో చిక్కుకున్న ఆయన సజీవ దహనమయ్యారు. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హావేరి లోకాయుక్త కార్యాలయంలో ఇన్స్పెక్టర్ సలీమత్ పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి హుబ్బళ్లి వైపు కారులో ప్రయాణించారు.

కాగా, అన్నీగేరి శివారులోని జాతీయ రహదారిపై ఆ కారు అదుపుతప్పింది. హ్యుందాయ్ ఐ20 డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు కొందరు సహాయం చేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు ఎగసిపడటంతో వెనక్కి తగ్గారు.

మరోవైపు పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. కారు డ్రైవింగ్ సీటులో ఉన్న కాలిన సలీమత్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. గడగ్‌లోని కుటుంబ సభ్యులను కలిసేందుకు కారులో ఆయన వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వణుకు పుట్టిస్తున్న చలి..

**- సాత్నాలలో 10.0 డిగ్రీల సెల్సీయస్ కనిష్ఠ ఉష్ణోగ్రత**
**- మారుమూల గ్రామాలను కమ్మేస్తున్న దట్టమైన పొగమంచు**
**- రైతులు, వృద్ధులు, చిన్నపిల్లలకు తప్పని తిప్పలు**

ఆదిలాబాద్, డిసెంబర్ 6: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి చలి తీవ్రత ప్రజలకు వణుకు పుట్టిసుంది. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే.. రాబోయే జనవరి మాసంలో ఎలా ఉండబోతుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. గత పక్షం రోజులుగా జిల్లా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగిపోయి రాత్రి వేళల్లో చలి తీవ్రత కనిపిస్తుంది. శుక్రవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 11.5గా నమోదైంది. ఆదిలాబాద్ రూరల్ పిప్పల్‌ధరిలో 11.1,

తలమడుగులో 11.2, బేల మండలం చప్రాలలో 11.7, మావల మండలంలో 11.8, గాదిగూడలో కారికెలో 12.0, తాంసిలో 12.3, ఇంద్రవెల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 5వరకే పనులను ముగించుకుని ఇళ్లలోకి వెళ్లి పోతున్నారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా వెచ్చని దుస్తులను ధరిస్తున్నారు. చలి తీవ్రతకు చలి మంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.

# శరవేగంగా మేడారం అభివృద్ధి పనులు

ములుగు, డిసెంబరు6 మేడారంలో వనదేవతలు సమ్మక్క – సారలమ్మల గద్దెల పున: నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మంత్రులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో గద్దెల పనులపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి మేడారం జాతర జరగుతున్న విషయం తెలిసిందే. ఈసారి జనవరిలో అత్యంత ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది.

# ఆదివారం రాత్రిలోగా రీఫండ్ చేయాలి.. ఇండిగోకు కేంద్రం కీలక ఆదేశాలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:ఇండిగో సేవలు స్తంభించాయి. గత ఐదురోజుల్లో 2వేలకుపైగా విమానాలు రద్దయ్యాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. రద్దు చేసిన విమానాలకు సంబంధించిన రీఫండ్ ప్రక్రియను ఆదివారం సాయంత్రం వరకు పూర్తి చేయాలని విమానయాన సంస్థను కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ శనివారం ఆదేశించింది. ప్రయాణీకుల లగేజీని రాబోయే రెండు రోజుల్లో డెలివరీ చేయాలని కూడా మంత్రిత్వ శాఖ చెప్పింది. దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో వెయ్యికపైగా విమానాలను రద్దు చేసింది. రీఫండ్ విషయంలో ఆలస్యం జరిగినా.. నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రద్దయిన, అంతరాయం కలిగిన అన్ని విమానాలకు రీఫండ్ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటలలోపు పూర్తి చేయాలని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

రద్దు కారణంగా ప్రయాణం ప్రభావితమైన ప్రయాణీకుల నుంచి ఎలాంటి రీషెడ్యూలింగ్ ఫీజులను సైతం వసూలు చేయొద్దని స్పష్టం చేసింది. ఇటీవల వరుసగా విమానాలను ప్రభావితమవుతున్న విషయం తెలిసిందే. దాంతో విమానాల రద్దు నేపథ్యంలో రీఫండ్‌ను ఆటోమేటిక్‌గా తిరిగి ఇవ్వనున్నట్లు ఇండిగో స్పష్టం చేసింది. డిసెంబర్ 5, డిసెంబర్ మధ్య రద్దు, రీషెడ్యూల్ అభ్యర్థనలను తాము పూర్తిగా గౌరవిస్తామని ఇండిగో పేర్కొంది. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా వివిధ విమానాశ్రయాల్లో శనివారం 400కుపైగా విమానాలు రద్దయ్యాయి. ప్రయాణికులకు ప్రత్యేకంగా సహాయం, సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ సెల్ ప్రస్తుత సంక్షోభం కారణంగా ప్రభావితమయ్యే ప్రయాణీకులను ముందస్తుగా స్పందించి రీఫండ్ లేదంటే.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు చెబుతుందని ప్రభుత్వం ఆదేశించింది. కార్యకలాపాలు పూర్తిగా సాధారణ పరిస్థితి చేరే వరకు ఆటోమేటిక్ రీఫండ్ వ్యవస్థ యాక్టివ్‌గా ఉండాలని.. విమాన రద్దు, ఆలస్యం కారణంగా ప్రయాణికులు అందుకోలేకపోయిన వారి లగేజీని రాబోయే 48 గంటల్లో తిరిగి ఇచ్చేలా చూడాలని ఇండిగోను మంత్రిత్వశాఖ ఆదేశించింది.

# మంత్రి ఉత్తమ్‌ను కలిసిన పాశం సంజయ్ బాబు



యాదాద్రి, డిసెంబర్ 6: యాదాద్రి భువనగిరి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన పాశం సంజయ్ బాబు ముదిరాజ్ శనివారం రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి శాలువా కప్పి సన్మానించారు.

తన ఎన్నికకు సహకరించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుబ్బాక నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఏలమోని శ్రీకాంత్, గంగానమోని శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు న్యాయం కల్పించడం కోసమే సుప్రీం కోర్టు

## -సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ డిసెంబర్ 6(ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సామాన్యులకు న్యాయం కల్పించడం కోసమే సుప్రీం కోర్టు అన్న బలమైన సందేశాన్ని పంపాలను కుంటున్నామని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ శనివారం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్దిష్ట సమయంలో త్వరగా పరిష్కరించడమే తన ప్రాధాన్యంగా ఆయన వెల్లడించారు. హిందుస్థాన్ టైమ్స్ నాయకత్వ సదస్సులో సామాన్యులకు న్యాయం అందుబాటులోకి రావలసిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. న్యాయపరమైన ఖర్చులు ఎలా తగ్గించాలి వ్యాజ్యాల పరిష్కారానికి సహేతుకమైన కాలపరిమితిని ఎలా నిర్ణయించాలి అన్నవే తన ప్రాధాన్యంగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి అడగ్గా, రాజ్యాంగంలో అధికార విభజన ఎలా జరిగిందో ప్రస్తావించారు. ప్రభుత్వశాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల పాత్రలను రాజ్యాంగం చక్కగా నిర్వచించిందని వివరించారు. ఒకదానిపై మరొకటి అతిక్రమించే అతివ్యాప్తి లేదన్నారు. కొన్ని వ్యాజ్యాల ప్రాధాన్యతతో సహా రానున్న రోజుల్లో సుప్రీం కోర్టులో కొన్ని సంస్కరణలు రావలసి ఉందన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ క్రైమ్స్ వంటి కేసులను ఉదహరిస్తూ న్యాయవ్యవస్థ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని , అందువల్ల న్యాయవ్యవస్థ అప్‌డేట్ కావలసి ఉందన్నారు. నాణ్యమైన న్యాయసహాయం అందించడానికి దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించవలసి ఉందని, ఈమేరకు ఎవరికైతే సహాయం అవసరమో వారికి న్యాయం అందించడానికి సమర్థులైన న్యాయవాదులు నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు.

# ఎట్టకేలకు శాంతి బహుమతి గెలుచుకున్న డోనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు శాంతి బహుమతి గెలుచుకున్నారు. అయితే ఓస్లోలోని నోబెల్ కమిటీ ఆ అవార్డును ఇవ్వలేదు. కానీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య ఫిఫా ట్రంప్‌కు గౌరవ పీస్ ప్రైజ్‌ను అందజేసింది. నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ ట్రై చేసినా ఆయనకు ఆ అవార్డు దక్కలేదు. కానీ కన్సోలేషన్ రీతిలో ట్రంప్‌కు ఫిఫా తన తొలి పీస్ ప్రైజ్‌ను అందజేసింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కొన్ని సంక్షోభాలను పరిష్కరించడంలో ట్రంప్ సక్సెస్ అయ్యారని, దాని కోసమే ఆయనకు అవార్డు అందజేస్తున్నట్లు ఫిఫా తెలిపింది. వాషింగ్టన్‌లోని కెన్నడీ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వచ్చే ఏడాది జరిగే ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ టోర్నీని అమెరికాతో పాటు కెనడా, మెక్సికో దేశాలు హోస్ట్ చేయనున్నాయి. వరల్డ్ కప్ డ్రా తీస్తున్న సందర్భంగా జరిగిన ఈవెంట్‌లో ట్రంప్‌కు స్పెషల్ ప్రైజ్ అందజేసింది. ఆ కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నే, మెక్సికో ప్రధాని క్లాడియా షీన్‌బామ్ పాల్గొన్నారు. ఫిఫా అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినో కూడా కార్యక్రమంలో ఉన్నారు. ఫిఫా పీస్ ప్రైజ్‌ను ఇవ్వనున్నట్లు గత నెలలోనే ఫిఫా ఓ ప్రకటన చేసింది. అవార్డు కార్యక్రమంలో ట్రంప్‌కు ఓ మెడల్ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, ఐక్యతను ప్రమోట్ చేసిన ట్రంప్‌కు శాంతి బహుమతి ఇస్తున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాన్ని తెలిపారు.

# గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు మహర్దశ

## -యార్లగడ్డ కృషితో కోల్ ఇండియా రూ.2.36 కోట్లు నిధులు మంజూరు

గన్నవరం, డిసెంబర్ 6: పేద ప్రజలకు సేవలు అందించే గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి వివిధ సంస్థల నుంచి నిధులు సమీకరించడంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చేసిన కృషి ఫలించింది. గన్నవరం ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన నిర్ణయించారు.

ఎమ్మెల్యే పదవి చేపట్టిన వెంటనే ఆసుపత్రి అభివృద్ధికి నిధుల కోసం వైద్యఆరోగ్య శాఖను సంప్రదించగా, నిధుల కొరత కారణంగా ప్రతిపాదనలు పంపితే ప్రాధాన్యతా క్రమంలో పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. అధికారుల ప్రక్రియ వల్ల ఆలస్యం జరుగుతుందని భావించిన యార్లగడ్డ, వివిధ కార్పొరేట్ సంస్థలతో సంప్రదింపులు జరిపి సిఎస్ఆర్ నిధులను తెచ్చేందుకు కృషి చేశారు.

ఈ ప్రయత్నాలు ఫలించి, కోల్ ఇండియా ఛైర్మన్ పోలవరపు ప్రసాద్‌ను కలిసి వైద్యశాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. యార్లగడ్డ విజ్ఞప్తికి స్పందించిన ప్రసాద్, పదవీవిరమణకు రెండు రోజుల ముందు రూ.2.25 కోట్ల గన్నవరం సామాజిక వైద్యశాల అభివృద్ధికి మంజూరు చేశారు.

ఈ నిధులతో గన్నవరం సామాజిక వైద్యశాలలో కొత్తగా నాలుగు ఓపి రూములు నిర్మాణానికి రూ.60 లక్షలు, రక్త నిల్వ గది రూ.15 లక్షలు, ఆఫీసు రూమ్ రూ. 12 లక్షలు, ఎమర్జెన్సీ రూమ్ రూ.15 లక్షలు, బయో మెడికల్ వేస్ట్ రూమ్ రూ.10 లక్షలు, పోస్టుమార్టం గది రూ. 6 లక్షలు, ఎన్బిఎస్యు రూ.12 లక్షలు, సిపాప్ ఫర్ న్యూ బోర్న్ రూ.2.91 లక్షలు, ప్లంబింగ్ పనులకు రూ. 5లక్షలు, రూ.7 లక్షల ఖర్చుతో విద్యుదీకరణ పనులుతోపాటు అధునాతన డెంటల్ చైర్ రూ.3 లక్షలు, అల్ట్రాసౌండ్ మిషన్, స్టాఫ్ నర్స్, హెడ్ నర్స్, డ్యూటీ డాక్టర్స్, ఫిజియోథెరపీ, లేబర్ తదితర గదుల నిర్మాణం, వైద్యచికిత్సలకు అవసరమైన అధునాతన వైద్య పరికరాల ఏర్పాటుకు ఈ రూ. 2.25 కోట్ల నిధులను వెచ్చించనున్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం. చైర్మన్ ప్రసాద్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసినందుకు యార్లగడ్డ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

# క్రిస్మస్ వేడుకల్లో విషాదం.. దూసుకొచ్చిన కారు పది మంది మృతి

పారిస్ డిసెంబర్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఫ్రాన్స్ దేశంలో ఓవర్సీస్ ప్రాంతంలో క్రిస్మస్ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గ్వాడెలోప్‌లోని సెయింట్ ఆన్‌లో క్రిస్మస్ వేడుకలు జరగుతుండగా వారిపైకి కారు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో పది మంది మృతి చెందగా తొమ్మిది మంది గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో కారు డ్రైవర్ అనారోగ్య సమస్యలు తలెత్తడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన తరువాత డ్రైవర్ అక్కడే ఉన్నాడు. ఫ్రాన్స్ పౌరులు శోకసంద్రంలో మునిగిపోయారు.


ఆహ్వానం



ఉదయ సాహితి తెలంగాణ



7
డిసెంబర్ 2025
ఆదివారం
ఉ॥ 9.30 గంటలకు

వేదిక :
ఎన్.టి.ఆర్. ఆడిటోరియం,
సురవరం ప్రతాపరెడ్డి
తెలుగు విశ్వవిద్యాలయం,
నాంపల్లి, హైదరాబాద్.



అందరూ ఆహ్వానితులే !

ఉదయ సాహితి - తెలంగాణ

ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారి
70వ జన్మదినోత్సవ సందర్భంగా వెలువరించిన

అక్షర గీతం (సప్తతి సంచిక)
ఆవిష్కరణ సభ

ముఖ్య అతిథి : శ్రీ సి.హెచ్. విద్యాసాగర్ రావు గారు, మహారాష్ట్ర పూర్వ గవర్నర్
గ్రంథావిష్కర్త : డా. కె.వి. రమణాచారి గారు, ఐ.ఏ.ఎస్. రిటైర్డ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : డా. సుద్దాల అశోక్‌తేజ గారు, ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ పురస్కార గ్రహీత
సభా ప్రారంభకులు : శ్రీ అమర్‌సింగ్ తిలావత్ గారు - (దాస్యం బాల్యమిత్రులు) ఉమ్మడి ఆం.ప్ర రాష్ట్ర మాజీ మంత్రివర్యులు
ప్రార్థనా గీతం : శ్రీమతి సావిత్రి రంజోల్కర్ గారు - నవీ ముంబై, సంపాదకులు-అక్షర గీతం
అక్షర గీతం నేపథ్య వివరణ : శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య గారు, రాష్ట్ర అధ్యక్షులు, ఉదయ సాహితి, తెలంగాణ, ప్రధాన సంపాదకులు, అక్షర గీతం
విశిష్ట అతిథులు : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు, సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
డా. నలిమెల భాస్కర్ గారు, బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు గ్రహీత, కరీంనగర్.
శ్రీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గారు, జాయింట్ సెక్రటరీ, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాలు, తెలంగాణ
గౌరవ అతిథులు : డా. అమ్మంగి వేణుగోపాల్ గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి కాళోజీ పురస్కార గ్రహీత
డా. నామోజు బాలాచారి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీ బైస దేవదాస్ గారు, సంపాదకులు, నేటి నిజం
ఆత్మీయ అతిథులు - అభినందన సందేశాలు :
ఆచార్య మసన చెన్నప్ప గారు, ప్రముఖ సాహితీవేత్త
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత
శ్రీ సరికొండ కోటంరాజు గారు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం, సీనియర్ కార్యకర్త
డా. దాస్యం విజయ కుమార్, ప్రముఖ వైద్యులు, (దాస్యం సోదరులు)-నిర్మల్.
శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి గారు, అక్షర యాన్, వ్యవస్థాపకురాలు
శ్రీ అనుముల దయాకర్ గారు, శాతవాహన టైమ్స్ ఎడిటర్-ఆదిలాబాద్.
మేజర్ శ్రీ రేళ్ల సంజీవ్ గారు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కరీంనగర్.
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి, కరీంనగర్.
పుస్తక పరిచయం : శ్రీమతి ధూళిపాళ అరుణ గారు, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి
తొలి ప్రతి స్వీకర్త : శ్రీ ఆశ్వాపురం వేణుమాధవ్ గారు, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు
సభా సమన్వయం : డా. పోరెడ్డి రంగయ్య గారు, ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ.
వందన సమర్పణ : శ్రీమతి మూర్తి శ్రీదేవి గారు, సంపాదకురాలు-అక్షరగీతం, రాష్ట్ర మహిళా కార్యదర్శి, ఉ.సా.తె.

ఆహ్వానించువారు :
రమాదేవి కులకర్ణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉ.సా.తె.
పురిమళ్ల సునంద, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉ.సా.తె.
డా. తులసి వెంకట రమణాచార్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉ.సా.తె.
లక్ష్మి పద్మజ దుగ్గరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉ.సా.తె.

# సాయుధ బలగాల త్యాగాలు వెలకట్టలేనివి !

## (07 డిసెంబర్ "సాయుధ దళాల పతాక దినోత్సవం" సందర్భంగా)

భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడటానికి మన రక్షణ రంగ త్రివిధ దళాల్లో ఇండియన్ ఆర్మీ సైనికులు(సోల్జర్స్), నావికాదళ నావికులు (సెయిలర్స్), వైమానిక దళ ఏయిర్‌మెన్‌ల త్యాగాల పునాదులు మరువలేనివి. మన త్రివిధ దళాలకు చెందిన సాయుధ బలగాల అంకితభావం, నిబద్ధత, విధి నిర్వహణ, దేశభక్తి, క్రమశిక్షణ, ప్రాణాలకు తెగించి పోరాడటం, ధైర్య శౌర్య పరాక్రమాలను గుర్తు చేసుకుంటూ, వారి శ్రేయస్సు, సంక్షేమాలను కోరుకుంటూ, దేశవ్యాప్తంగా 07 డిసెంబర్ రోజున పౌర సమాజం "సాయుధ దళాల పతాక దినోత్సవాలు (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే)" నిర్వహించుకుంటూ, అమర వీరుల కుటుంబాలకు సహానుభూతి, సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాల రూపంలో చేయూత అందిస్తూ, అత్యంత దేశభక్తితో కార్యక్రమాలు నిర్వహించడం 1949 నుంచి కొనసాగుతున్నది.

### సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాల సేకరణ:

దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల భవిష్యత్తుకు, గాయపడిన సైనికుల పునరావాసం, మాజీ సైనికుల సేవలను గుర్తించడం, భర్తలను కోల్పోయిన వీర నారీమణుల సంక్షేమానికి చెందే విధంగా స్థానిక సైనిక బోర్డుల నేతృత్వంలో స్టాంపులు, పతాకాలను పంచుతూ, సంక్షేమ నిధులను సేకరించడం ఆనవాయితీగా మారింది. దేశవ్యాప్తంగా విస్తరించిన కేంద్ర ప్రభుత్వ సైనిక బోర్డులు, 32 రాష్ట్ర సైనిక బోర్డులు, 392 జిల్లా సైనిక బోర్డుల సహకారంతో పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించబడుతుంది. దేశ భద్రతే ఊపిరిగా, దేశ సమగ్రతను కాపాడటానికి ప్రాణాలకు తెగించి పోరాడటం, దేశ సరిహద్దు కంచెలుగా అనుక్షణం విధులను నిబద్ధతతో నిర్వహించడం లాంటి సద్గుణ త్యాగమయ జీవితాలు మనందరికీ నిత్య ప్రేరణలు అవుతున్నాయి. సాయుధ పతాక దినోత్సవ వేడుకల్లో ఎరుపు(ఆర్మీ), ముదురు నీలం(నావీ), ఆకాశ నీలం(ఏయిర్‌ఫోర్స్) రంగులతో కూడిన జెండాలు, కార్లకు స్టిక్కర్లు, బ్యాడ్జీలు, సాధారణ స్టిక్కర్లు లాంటివి పంచుతూ, నేటి యువతీయువకులు సాయుధ బలగాల సంక్షేమ నిధికి విరాళాలు సేకరిస్తుంటారు.

పతాక దినోత్సవ వేదికగా ఆర్మీ, నావీ, ఏయిర్‌ఫోర్స్ విభాగాల సైనిక సిబ్బంది సేవలను కొనియాడుతూ, మనసు నిండా కృతజ్ఞతలను తెలియజేస్తూ, వారి త్యాగమయ జీవితాలను ఆదర్శంగా తీసుకుంటూ, భరత మాత సేవలో పునీతులం అవుదాం. వీర సైనికుల సాహసాలు, పోరాట పటిమ, శత్రువుల గుండెల్ని చీల్చగల తెగువ కొనియాడదగినవని గుర్తు చేసుకుందాం. మన సాయుధ దళాల సంక్షేమ నిధికి ఉదారంగా వికాసాలు అందజేస్తూ, అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసి మన సంఘీభావాన్ని తెలియజేద్దాం, త్రివిధ దళాల అమూల్య సేవలను కొనియాడుదాం.



-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వ్యవసాయ రంగంలో భారత్-రష్యా సహకారాన్ని బలోపేతం చేసేలా రెండు దేశాల వ్యవసాయ మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: రష్యన్ ఫెడరేషన్ వ్యవసాయ మంత్రి గౌరవ ఒక్సానా లట్‌తో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. కృషిభవన్లో 2025, డిసెంబర్ 4న జరిగిన ఈ సమావేశంలో కొనసాగుతున్న సహకారం, భవిష్యత్తులో భాగస్వామ్యం కుదుర్చుకొనే రంగాలపై ఇరు పక్షాలు చర్చించాయి.

నమ్మకం, స్నేహం, పరస్పర సహకారం ఆధారంగా భారత్-రష్యా సంబంధాలు ఏర్పడ్డాయని మంత్రులు స్పష్టం చేశారు. ద్వైపాక్షిక వ్యవసాయ వాణిజ్యం విస్తరిస్తోందనీ, ప్రస్తుతం దీని విలువ 3.5 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉందనీ శ్రీ చౌహాన్ తెలియజేశారు. మరింత సమతుల్యమైన వాణిజ్యాన్ని అవలంబించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ.. భారతీయ బంగాళాదుంప, దానిమ్మ, విత్తనాల ఎగుమతులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించిన రష్యాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యాన్ని పెంపొందించడానికి, భారత్ నుంచి ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఉన్న అవకాశాలను ఉభయ పక్షాలు అన్వేషించాయి.

ఈ సమావేశంలో.. వ్యవసాయ పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్య నిర్మాణంలో సహకారాన్ని బలోపేతం చేసే దిశగా రష్యాలోని ఫెడరల్ సెంటర్ ఫర్ యానిమల్ హెల్త్, ఐసీఏఆర్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

వచ్చే ఏడాది భారత్ ఆతిథ్యమిస్తున్న బ్రిక్స్ దేశాల వ్యవసాయ మంత్రుల సమావేశంలో పాల్గొనాలని రష్యా వ్యవసాయ మంత్రిని శ్రీ చౌహాన్ ఆహ్వానించారు.

వ్యవసాయ వాణిజ్యం, ఎరువులు, విత్తనాలు, మార్కెట్ సౌలభ్యం, ఉమ్మడి పరిశోధనలో సహకారాన్ని మరింత విస్తరించేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. అలాగే ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలోనూ, రెండు దేశాల రైతులకు ప్రయోజనాలు అందించడంలోనూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. వాణిజ్యాన్ని పెంపొందించడం, వ్యవసాయం రంగంలో సహకారాన్ని విస్తరించడంపై లట్ ఆసక్తిని ప్రదర్శించారు.

రష్యా ప్రతినిధి బృందంలో వ్యవసాయ మంత్రితో పాటుగా.. సహాయ మంత్రులు శ్రీ మాక్సిమ్ మార్కోవిచ్, మరీనా అఫోనినా, ఎఫ్ఎస్‌వీపీఎస్ అధినేత సెర్జీ డంక్వెర్ట్, ఆసియా విభాగ డైరెక్టర్ శ్రీమతి దరియా కొరొలెవా, ఇతర సభ్యులు ఉన్నారు.

భారత్ తరఫున వ్యవసాయం, రైతు సంక్షేమ విభాగం కార్యదర్శి శ్రీ దేవేశ్ చతుర్వేది, డీఏఆర్ఈ కార్యదర్శి శ్రీ ఎంఎల్ జాట్, ఎరువుల విభాగం కార్యదర్శి శ్రీ రజత్ కుమార్ మిశ్రా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, వ్యవసాయం, రైతు సంక్షేమ విభాగ సంయుక్త కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# శ్రమదానం చేసిన కలెక్టర్

### -ఉద్యోగులతో కలిసి పరిసరాలు పరిశుభ్రం కార్యక్రమం

మచిలీపట్నం, డిసెంబర్ 6: స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి చెత్తా చెదారాన్ని ఏరి పారేశారు. అదేవిధంగా శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం నివారణలో భాగంగా ప్రతి శనివారం కలెక్టరేట్‌కు ఉద్యోగులందరూ నడక, లేదా సైకిల్‌పై రావాలని పిలుపునిచ్చారు. ఈ రోజు కలెక్టర్ స్వయంగా కలెక్టరేట్‌కు సైకిల్ పై వచ్చారు.

# సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

### -పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉండి

అమరావతి,డిసెంబర్ 6: మోపిదేవి గ్రామంలో కొలువుదీరిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే ఉండి , ఏపీ ఐసీసీ చైర్మన్ మంతిన రామ రాజు, నియోజకవర్గం పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి అందజేశారు.

# నా స్వగ్రామ రూపురేఖలు మార్చుతా

### -చింతల్ చెరువు సర్పంచ్ అభ్యర్థిని మమత శివకుమార్



మెదక్, డిసెంబర్ 6:తనకు అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపుతామని చింతల్ చెరువు సర్పంచ్ అభ్యర్థిని మమత శివశంకర్ అన్నారు. తన భర్త శివకుమార్ ప్రోత్సహంతో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నానని, తన భర్త నిత్యం గ్రామ అభివృద్ధి కోసం తపిస్తారని, అధికారం లేకున్నా గ్రామానికి తన వంతుగా బాధ్యతాయుతంగా ఎంతో చేశారని, అవకాశం ఇస్తే చింతల్ చెరువును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని మమత శివశంకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధి హత్నూర మండలం చింతల్ చెరువులో మమత శివకుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

గ్రామంలో పూర్వ పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని సర్పంచ్ అభ్యర్థిని మమత శివకుమార్ తెలిపారు. తనదైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమమే తమ అభిమతమని అన్నారు. అదే పంథాతో ప్రచారం నిర్వహిస్తు ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తమ మేనిఫెస్టో (24 అంశాలు) విడుదల చేశామని, తమ విజన్ ను గ్రామస్థుల ముందు ఉంచామని అన్నారు.

గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనతో పాటు ప్రధాన హామీలు ఇచ్చినట్లు చింతల్ చెరువు సర్పంచ్ అభ్యర్థిని మమత శివశంకర్ తెలిపారు.

ప్రతి వార్డులో వీధి దీపాలు ఏర్పాటు, నిరంతరం తాగునీరు, పారిశుధ్యం మెరుగుకు కృషి

తాను పదవిలో ఉన్నంత కాలం ఐదేళ్లు గ్రామంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకి రూ.5000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తా. (పెళ్లిళ్ల నాటికి అమ్మాయికి హితిధికంగా డబ్బు సహాయం పడుతుంది)

గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు, గ్రామానికి చెందిన యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పన, సీసీపీఎల్‌తో గ్రామంలో క్రీడలు, ఆటల షెడ్యూల్, వృద్ధులకు ప్రత్యేక స్థలం, పాఠశాలకు కొత్త భవనం, గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు, గ్రామంలో ఒక మంచి పరిశ్రమ ఏర్పాటు, చెరువుచుట్టు వాకింగ్ ట్రాక్, ఎవరైనా చనిపోతే బంధువులు వచ్చే వరకూ పార్థివదేహం ఉంచడానికి ఒక ఐస్ బాక్సు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వీటితోపాటు మరిన్ని హామీలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

# పోలీసు వ్యవస్థకు వెన్నుముక..

### -ప్రజా రక్షణలో వారి సేవలు అనిర్వచనం..
### -సమర్థమంతమైన సేవలు వీరికే సాధ్యం?
### -విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు..
### -63వ హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు..
### -ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు..

విజయవాడ, డిసెంబర్ 6: పోలీసు వ్యవస్థకు వెన్నుముక హోంగార్డులేనని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజ శేఖర్ బాబు పేర్కొన్నారు. విజయవాడలోని ఏఆర్ గ్రౌండ్స్ లో శనివారం 63వ హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు.



ఈ వేడుకలకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ముఖ్యఅతిథిగా పాల్గొనగా హోం గార్డ్ లు గౌరవ వందనం సమర్పించి, సాదరంగా ఆహ్వానించారు. పెరేడ్ కమాండర్ హోంగార్డ్ 116 ఎన్.సాయి కుమార్ నేతృత్వంలో 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవమును పురస్కరించుకుని లయబద్ధంగా చక్కటి పెరేడ్ నిర్వహించి పోలీస్ కమిషనర్, ఇతర అధికారులకు గౌరవ వందనం సమర్పించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లడుతూ.. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హోంగార్డులు అందరికి శుభాకాంక్షలు. విజయవాడ సిటీలో పోలీస్ కమిషనరేట్ లో మొత్తం 1000 మంది హోంగార్డులు శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, క్రైమ్ నియంత్రణ, సి.ఐ.డి, టాస్క్ ఫోర్స్ పోలీస్ అంతర్గత భద్రతా, పోలీస్ వాహనాల డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలందు భద్రత కొరకు అనేక టెక్నికల్ కేటగిరీలో పని చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రతి పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు పర్యవేక్షణ, టెక్నీషియన్లుగా కూడా విధులను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, కోవిడ్ వంటి అత్యవసర విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు విధులు నిర్వహించటం, మతసామరస్యాన్ని కాపాడటం, ఆర్థిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఇవన్నీ హోంగార్డుల విధులలో భాగమేనన్నారు.

విజయవాడ సిటీ పరిధిలో వి.వి.ఐ.పి, వి.ఐ.పి.ల బందోబస్తులు, దసరా నవరాత్రులు, మేరిమాత ఉత్సవాలు, భవాని దీక్షలు లాంటి బందోబస్తులు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, నైట్-బీట్స్, డే-బీట్స్, కమ్యూనికేషన్ విభాగాలలో వీరు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఎక్స్ గ్రేషియా 5 లక్షల రూపాయలు చొప్పున అందిస్తున్నాం అన్నారు. ఆయన ఈ సంవత్సరంలో మరణించిన నలుగురు హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. అంతేకాక ఈ సంవత్సరంలో మరణించిన 4 హోంగార్డుల కుటుంబాలకు, పదవీ విరమణ చేసిన (13) మంది హోంగార్డులకు ఒకరోజు వేత నాన్ని ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయలు చొప్పున మొత్తం 85 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మరణించిన హోంగార్డు కుటుంబ సభ్యులలో అర్హులు అయిన నలుగురికి కారుణ్య నియామకం క్రింద హోంగార్డు ఉద్యోగం ఇచ్చామన్నారు. హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్ క్రింద 2,000 రూపాయలు నుండి 6,000/- రూపాయలు వరకు అందిస్తున్నాం అన్నారు. ఈ సంవత్సరం 2025లో 40 మంది హోంగార్డుల పిల్లలకు ఇవ్వటం జరిగినది. హోంగార్డులు ప్రమాదవశాత్తు మరణిస్తే.. వారికి మట్టి ఖర్చుల నిమిత్తం 30 వేల రూపాయలు అదనంగా చేస్తున్నామన్నారు. హోంగార్డుల సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పథకాలు ఇప్పటి వరకు 55 మంది హోంగా ర్డులకు సీనియారిటీ ప్రాతిపదికన ఇవ్వడం జరిగిందన్నారు. హోంగార్డులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పదవి విరమణ చేసిన హోంగార్డులను కమిషనర్ రాజశేఖర్ బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి పోలీస్ కమిషనర్లు డి.సి.పి.లు కృష్ణ ప్రసన్న, ఎస్.వి.డి.ప్రసాద్, హోంగార్డ్స్ కమాండెంట్ టి.ఆనందబాబు, క్రైమ్ ఏ.డి.సి.పి. రాజా రావు, ఏ.ఆర్. ఏ.డి.సి.పి. కె.కోటేశ్వర రావు, ఏ.సి.పి.లు. ఇన్స్పెక్టర్లు, హోంగార్డ్స్ ఆర్.ఐ. సుధాకర్ రెడ్డి, సుమారు 200 హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# అది.. రాజ్యాంగ ఫలితమే..

బంటుమిల్లి, డిసెంబర్ 6: భారతరత్న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి స్మృత్యంజలి కార్యక్రమాన్ని బంటుమిల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లి పట్టణంలో అంబేద్కర్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద బంటుమిల్లి మండల జై భీమ్ యూత్ కమిటీ వారిచే ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో దళిత ఉద్యోగులు, నాయకులు, యువకులు, వ్యాపారులు వివిధ చేతి వృత్తులు పని వారు, పలు రాజకీయ పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ప్రధాన వక్తలు మాట్లాడుతూ మరణించి 69 ఏళ్లు గడిచినా ప్రజలందరి దేవుడైన అంబేద్కర్ ప్రతి ఒక్కరు మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, బడుగు వర్గాలు రాజ్యాంగ పదవుల్లో గౌరవంగా నిలుచున్నా, కోట్లాదిమంది ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నా అది మహనీయుడు అంబేద్కర్ పెట్టిన భిక్ష అని, వారి ఆశయాలకు అనుగుణంగా అందరూ నడవాలని ఆకాంక్షించారు.

దేశంలో విభిన్న కులాలు, మతాలకు చెందిన అందరం కలసి మెలసి ఉన్నామంటే.. అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలితమే అన్నారు. అందరం కలసి మెలసి ఉంటూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని యావత్ భారత దేశాన్ని కలిపి ఉంచే ఒకే ఒక పేరు అంబేద్కర్ అని, ప్రపంచంలోనే అతి గొప్ప పెద్ద రాజ్యాంగాన్ని రచించి ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతామని విచ్చేసిన వారందరూ ప్రతిజ్ఞ చేశారు.

# అంతర్జాతీయ వన్యప్రాణి నేరస్థురాలి అరెస్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:వన్యప్రాణి నేర నియంత్రణ బ్యూరో (డబ్ల్యూసీసీబీ), మధ్యప్రదేశ్ స్టేట్ టైగర్ స్ట్రయిక్ ఫోర్స్ (ఎంపీ ఎస్‌టీఎస్ఎఫ్) సమన్వయంతో కృషి చేసి యాంగ్‌చన్ లచింగ్పాను అరెస్టు చేశాయి. ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులో పేర్కొన్న ప్రకారం, ఈ అంతర్జాతీయ వన్యప్రాణి నేరస్థురాలి కోసం అన్ని దేశాల్లో పోలీసులు వెదుకుతున్నారు. నిరంతరంగా సాగిన గోప్య యత్నాలతో పాటు క్షేత్ర కార్యాచరణను కూడా చేపట్టి, ఈమెను ఈ నెల 2న ఉత్తర సిక్కింలోని లాచుంగ్‌లో అరెస్టు చేశారు.

ఇది దేశంలో అన్నింటి కన్నా ముఖ్యమైన అరెస్టుల్లో ఒకటి. దీనిలో.. ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు ఆధారంగా వన్యప్రాణి నేరస్థురాలిని అరెస్టు చేశారు. నిందితురాలికి సంబంధించిన నోటీసును గత అక్టోబరు 2న ఇంటర్‌పోల్ లైజాన్ ఆఫీసు హోదాలో డబ్ల్యూసీసీబీ అందుకుంది. ఈ ఆపరేషన్లో సిక్కిం పోలీసులు, అటవీ విభాగం, న్యాయ వ్యవస్థ, జిల్లా పాలనయంత్రాంగం పూర్తి సహకారాన్ని అందించాయి. ప్రజల్లో చెలరేగిన ఉద్వేగ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, సురక్షిత తరలింపు ఏర్పాట్లు చేయడం కోసం ఎస్ఎస్‌బీ సిక్కింతో పాటు సిలిగురి నుంచి కూడా సహాయాన్ని తీసుకున్నారు.

అరెస్టు అనంతరం నిందితురాలికి తప్పనిసరి వైద్య పరీక్ష చేసి సంబంధిత న్యాయస్థానంలో హాజరు పరచడానికి గాను గ్యాంగ్‌టక్‌కు తీసుకువెళ్లారు. వైద్య పరీక్షలను పూర్తి చేసిన తరువాత, ఆమెను గత డిసెంబరు 3న న్యాయస్థానంలో హాజరుపరిచారు. అక్కడ ఆమె జామీను కోరుతూ పెట్టుకున్న వినతిని కొట్టివేశారు. తాత్కాలిక నిర్బంధానికి గాను మధ్యప్రదేశ్‌కు తరలించాలని ఆదేశాలిచ్చారు. తదుపరి న్యాయ విచారణ సంబంధిత కార్యకలాపాలను మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో చేపడతారు.

కేసు నేపథ్యం

మధ్యప్రదేశ్ అటవీ విభాగం 2015 జులై 13న హోషంగాబాద్ (నర్మదాపురం)లోని సాత్పురా పులుల అభయారణ్యానికి చెందిన కామ్తి రేంజ్‌లో వన్యప్రాణి నేరానికి సంబంధించిన కేసు నమోదు అయింది. పులి శరీర భాగాలనూ, అలుగు పొలుసులనూ చట్టవిరుద్ధంగా వేటాడి, వాటిని విక్రయించడానికి సంబంధించిన కేసు ఇది. ఈ కేసులో జప్తు చేసిన వస్తువుల్లో పులి ఎముకలు నాలుగు, ఒకటిన్నర కిలోల అలుగు పొలుసులు, పులి చర్మం, పులి ఎముక మజ్జ నుంచి తీసిన నూనె వంటివి ఉన్నాయి. ఈ కేసులో మరో ముఖ్య నిందితుడు శ్రీ జైతమాంగ్‌ను 2015 అక్టోబరులో అరెస్టు చేశారు. నిషిద్ధ వన్యప్రాణి దేహ భాగాలను తాను లచింగ్పాకు సరఫరా చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఆమే తనకు ఆశ్రయాన్ని కూడా కల్పించిందని తెలిపాడు. అతడి అపరాధ అంగీకారంతో చట్టవిరుద్ధ వాణిజ్య వ్యవస్థలో లచింగ్పా పాత్ర ఉందని రూఢి అయింది.

ఈ కేసులో మొత్తం 36 మందిని గురించి పేర్కొన్నారు. వారిలో 27 మందిని నర్మదాపురం చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు 2022 డిసెంబరు 20న దోషులుగా తేల్చారు. ఏమైనా, లచింగ్పా పరారైనందువల్ల ఆమెకు వ్యతిరేకంగా కార్యాచరణను చేపట్టడానికి వీలుపడలేదు. సిక్కింలోని లచింగ్/గ్యాంగ్‌టక్ ప్రాంత నివాసి అయిన లచింగ్పా వ్యవస్థీకృత చట్టవిరుద్ధ వాణిజ్య ముఠాలో ప్రముఖ సభ్యురాలు అని గుర్తించారు. ఈ ముఠాలో వేటగాళ్లతో పాటు మధ్యవర్తులు కూడా ఉన్నారు. ఈ ముఠా నేపాల్, టిబెట్, భూటాన్లలో చట్టవిరుద్ధ వన్యప్రాణి సీమాంతర వాణిజ్య మార్గాల్లో రాకపోకలు జరిపేది. ఢిల్లీ, సిలిగురి, గ్యాంగ్‌టక్, కోల్‌కతా, కాన్పూర్, ఇటార్సీ, హోషంగాబాద్‌లు సహా భారత్‌లో అనేక నగరాల్లో ఈ ముఠా కార్యకలాపాల్ని కొనసాగించింది.

లచింగ్పాను 2017 నవంబరులో మధ్యప్రదేశ్ స్టేట్ టైగర్ స్ట్రయిక్ ఫోర్స్ (ఎంపీ ఎస్‌టీఎస్ఎఫ్) కొంత కాలం పాటు అరెస్టు చేసింది. అయితే, ఆమె జామీను షరతుల్ని అతిక్రమించి, పరారైంది. ఫలితంగా ఆమె అరెస్టు నిమిత్తం 2019 జులై 29న వారంటును జారీ చేశారు. ఆమె పలాయనాన్ని దృష్టిలో పెట్టుకొని, ఇంటర్‌పోల్ రెడ్ నోటీసును తీసుకోవాల్సిందిగా సీబీఐ (ఇదే భారత జాతీయ కేంద్ర బ్యూరో (ఎన్‌సీబీ) తో పాటు వన్యప్రాణి అపరాధాలు సహా అన్ని నేరాలకు గాను రెడ్ నోటీసుల్ని జారీ చేస్తుంది)ని డబ్ల్యూసీసీబీ కోరింది. లచింగ్పా కోసం 2025 అక్టోబరు 2న "పరారీలో ఉన్న, విచారణ జరపడానికి అపేక్షిస్తున్నట్లుగా" ఒక నోటీసును జారీ చేశారు. ఆమెను ఈ నెల 2న అరెస్టు చేశారు. నిందితురాలు విదేశీ వన్యప్రాణుల, ప్రత్యేకించి పులి శరీరభాగాల అంతర్జాతీయ దొంగతనాల వాణిజ్యంలో ఒక ప్రముఖ రిలే పాయింటుగా అనుమానిస్తున్నారు. ముందు ముందు జరపబోయే దర్యాప్తు, ఈ అక్రమ వాణిజ్య ముఠాకు సంబంధించిన లోగుట్టులపై కీలకమైన లోతైన అవగాహనల్ని అందించ గలదని భావిస్తున్నారు.

"యువభారతి" సాహితీ సాంస్కృతిక సంస్థ
రస వాహిని మరియు ఐ.ఐ.ఎం.సి. కళాశాల
సంయుక్తాధ్వర్యంలో

"తెలుగు వెలుగు" సమాఖ్య కార్యక్రమాలు - పదునాలుగవ సమావేశం
డా. రాధశ్రీ గారు రచించిన "నల్లగుట్ట శ్రీహరి కూర్మనాథ స్వామి శతకము"
మరియు చిలకమర్తి వారి "గయోపాఖ్యానం" నాటకంపై ప్రసంగం

తేది : ఆదివారం, 7 డిసెంబర్ 2025 సమయం : సాయంత్రం 6.00 గం॥లకు
వేదిక : ఐ.ఐ.ఎం.సి. కళాశాల సభా ప్రాంగణం, Adj. Telephone Bhavan & Bajaj Electronics, లక్డీకాపూల్, హైదరాబాద్.

సభాధ్యక్షులు : ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారు
వ్యవస్థాపక సమావేశకర్త, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ
ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం
గ్రంథ కర్త : డా. రాధశ్రీ గారు
అధ్యక్షులు, "రస వాహిని"
గ్రంథ సమీక్షకులు : డా. ఆచార్య ఫణీంద్ర గారు
అధ్యక్షులు, "యువభారతి" సాహితీ సాంస్కృతిక సంస్థ
ప్రధాన వక్త : డా. సంగనభట్ల నర్సయ్య గారు
పూర్వ ప్రాచార్యులు, శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి
(అంశం : చిలకమర్తి వారి "గయోపాఖ్యానం" నాటక వైశిష్ట్యం)

SCAN FOR LOCATION
సాహిత్యాభిమానులందరికి ఇదే మా ఆహ్వానం
సమయ పాలన మన క్రమశిక్షణ

జీడిగుంట వెంకట్రావు, కార్యదర్శి, యువభారతి
కె. అమృత లక్ష్మి, కార్యదర్శి, రస వాహిని
కూర రఘువీర్, ప్రిన్సిపాల్, ఐఐఎంసి కళాశాల

# పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో డిసెంబర్ 6, 7 తేదీల్లో కర్ణాటక సంగీతోత్సవాలు- 'కృష్ణవేణి సంగీత నీరాజనం 2025'

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:విజయవాడలో 2025 డిసెంబర్ 6, 7వ తేదీల్లో 'కృష్ణవేణి సంగీత నీరాజనం' మూడో ఎడిషన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ మద్దతుతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ సహకారంతో భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది.

'తెలుగు సంప్రదాయ సంగీత వైభవం' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది జరుగుతున్న ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేయటం, సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించటం, చేతివృత్తులు, నేత కార్మికులకు మద్దతివ్వటం, కర్ణాటక సంగీతానికి ప్రముఖ గమ్యస్థానంగా విజయవాడను నిలపటం వంటి లక్ష్యాలను ప్రతిబింబిస్తుంది.

విజయవాడ ప్రజాప్రతినిధులు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, రాష్ట్ర పర్యాటక శాఖ అధికారుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖా మంత్రి శ్రీ కందుల దుర్గేష్ ఈ ఉత్సవాన్ని ప్రారంభిస్తారు.

ఈ ఉత్సవ ప్రణాళిక, సమన్వయం, నిర్వహణ బాధ్యతలను పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయానికి (దక్షిణం) అప్పగించింది. ఈ రెండు రోజుల్లో 98 మంది కళాకారులు 18 ప్రదర్శనలు ఇస్తారు. ముఖ్య వేదికైన తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శనలు జరుగుతాయి.

డిసెంబర్ 7న ఉదయం 7 గంటలకు దుర్గా ఘాట్‌లో పంచరత్న కృతుల సూర్యోదయ ఆలాపనను నిర్వహిస్తారు. మల్లాది సోదరుల నేతృత్వంలో జరిగే ఈ ప్రదర్శనకు విజయవాడ, గుంటూరు ప్రభుత్వ సంగీత కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తోడ్పాటునందిస్తారు. ఇది ఉత్సవంలోని సామాజిక సంగీత స్ఫూర్తిని బలపరుస్తుంది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి, సాంస్కృతికంగా ప్రాముఖ్యత కలిగిన దేవాలయాల్లో మూడు ఆరంభ ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించారు.

ప్రదర్శనలతో పాటు జీఐ ట్యాగ్ పొందిన ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలు, వస్త్రాల ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక లక్క బొమ్మలు, ఉదయగిరి చెక్క వంట సామాగ్రి, తోలు బొమ్మలు, నర్సాపూర్ లేస్, మంగళగిరి, వెంకటగిరి, చీరాల, ఉప్పాడ, మొరగుడి వంటి ప్రసిద్ధ చేనేత ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. వోకల్ ఫర్ లోకల్ జాతీయ లక్ష్యానికి ఈ ప్రదర్శనలు మద్దతివ్వటం ద్వారా వినియోగదారులతోనూ, మార్కెట్లతోనూ- కళాకారులు, చేనేత కార్మికులు నేరుగా అనుసంధానమవుతారు.

స్థానిక పర్యాటక, ఆతిథ్య రంగాలకు చెందిన వారు ఈ ఉత్సవాన్ని ప్రోత్సహించటంలోనూ, మద్దతివ్వటంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పత్రికా సమావేశానికి సహకరించినందుకు, ఉత్సవ సందేశాన్ని మరింత విస్తృతం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఏఎస్‌హెచ్ఏ)కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

తిర్యాణి, ఆంధ్రప్రభ : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతకాని మండల అధ్యక్షుడు దుర్గం రాజయ్య పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా దుర్గం రాజయ్య మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవలను బీసీ, ఎస్సీ ఎస్టీ బహుజనాల రాజ్యాధికారం కోసం ఆయన ఎంతో శ్రమించారన్నారు.

ప్రతి ఒక్క పౌరుడు స్వేచ్ఛ సమానత్వం, న్యాయం, రాజ్యాధికారం పొందుతున్నారంటే అది ఆయన రాసిన రాజ్యాంగం వల్లనే అని, ఆయన మేధస్సుని ఉపయోగించి రక్తాన్ని దార పోసి రాజ్యాంగాన్ని రాశాడని ఆయన ఆశయాలను అందరం కలిసి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం రమేష్, జాడి, భూమయ్య, దుర్గం పవన్, తిరుపతి మేన రాజు గౌడ్, కుర్సెంగ, శోభన్, పగిడి మోహన్, పెందోర్ ధర్మం కళ్యాణపు నరేష్ వివిధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

-భారతదేశానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్

-త్వరలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం

-ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



అమరావతి, డిసెంబర్ 6:భారతదేశానికి దిశా, నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ సేవలు విశ్వమానవాళికి మార్గదర్శకమని డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలో భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక సమానత్వ పోరాట యోధుడు, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను అంబేద్కర్ యువజన సంఘం, అచ్చంపేట డివిజన్ అధ్యక్షులు పాతుకుల శ్రీశైలం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యాన్ని బలపరచడంలో అంబేద్కర్ పోషించిన పాత్ర అపూర్వమని కొనియాడారు. ప్రతి భారత పౌరుడు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని చదవాలని, అంబేద్కర్ చూపిన మార్గం మనల్ని చైతన్యవంతమైన సమాజం వైపు నడిపిస్తుందని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థుల అభ్యాసానికి మరింత తోడ్పాటు అందించేందుకు అచ్చంపేట పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కేంద్రంలో పోటీ పరీక్షల కోసం అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, ఉమామహేశ్వర చైర్మన్ బీరం మాధవరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు బీసమిళ్ళ ఆనంద్, మీసాల ప్రభాకర్, కొంకి విజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మా రైతుల గోస తాకింది

-వెంకటరెడ్డి బాధితుల సంబరాలు

-కలెక్టరేట్ వద్ద పటాకులు కాల్చి గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంబరాలు




హన్మకొండ, డిసెంబర్ 6: హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి ఏసీబీ పట్టుబడటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు సంబరాలు చేసుకున్నారు. కలెక్టరేట్ గేటు వద్ద పటాకులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ 1956 గ్రీన్ ఫీల్డ్ హైవే చట్టం ప్రకారం మా భూములు తీసుకున్నారు. కరోనా సమయంలో భూములు తీసుకొని రెట్లు సవరించకుండా.. మాకు డబ్బులు ఇవ్వకుండా.. వెంకటరెడ్డి అడ్డుపడ్డాడు అని ఆరోపించారు.

గతంలో కలెక్టర్ గా పని చేసిన ఆమ్రపాలి ఆరేపల్లి, వంగ పహాడ్ గ్రామస్తులకు మార్కెట్ రేటు కంటే రెండు రూపాయలు ఎక్కువే ఇచ్చారన్నారు.కానీ మాకు న్యాయమైన పరిహారం ఇవ్వమని ఇప్పటి కలెక్టర్, రాజకీయ నాయకులు, నేషనల్ హైవే అధికారులు చెప్పినా వెంకటరెడ్డి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశాడని, మా రైతుల గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డాడని సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి అవినీతి అధికారులను కటినంగా శిక్షించాలని రైతులు డిమాండ్ చేశారు.

## మల్లేపల్లి గ్రామంలో ఘనంగా అంబేద్కర్ 69 వ వర్ధంతి

-రాజ్యాంగాన్ని,ప్రజాహక్కులను కాపాడుకుందాం: మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు

సంగారెడ్డి డిసెంబర్ 6 (ఎక్స్‌ప్రెస్ న్యూస్);డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగని రాసి మనదేశానికి అంకితం చేశారు అని ప్రజా కార్మిక హక్కుల నాయకుడు మల్లేపల్లి ప్రభాకర్ అన్నారు ,కొండాపూర్ మండలం, పారిశ్రామిక ప్రాంతం మల్లేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు , ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచులు, పాండురంగం, జగదీశ్వర్, ఏం పి టి సి రామదాసు, మాజీ ఉప సర్పంచ్ రామప్ప మహిళా సంఘం నేత సంపంగి పద్మక్క,వైనార్టీ నాయకుడు అలీబాబా సవారీ, అంబేద్కర్ సంఘం నాయకులు,గడ్డం మోగు లయ్యా,న సురేంద్, జార్జ్ తదితరాలు మాట్లాడుతూకుల, మతాలకు,అతీతంగా గ్రామంలోని ప్రజలందరూ ఐక్య ఐక్యము తో ఉండి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు రాబోయే ఎన్నికలో ప్రజల పక్షం కార్మికుల పక్షాన పని చేసే నిస్వార్థ నాయకుని మల్లేపల్లి గ్రామ సర్పంచిగా గెల్పించుకొని ప్రజా,కార్మిక,హక్కులు,సమస్యలు సాధించుకోవాలన్నారు.

# ఫిలిం సర్టిఫికేషన్ కోసం ఏర్పాటు చేసే అన్ని సమీక్షా, పునఃసమీక్షా కమిటీల్లో 50 శాతం మహిళా భాగస్వామ్యం ఉండేలా సీబీఎఫ్‌సీ చర్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: బోర్డు, అడ్వైజరీ ప్యానెళ్లలో మూడో వంతు మహిళా సభ్యులను తప్పనిసరి చేసిన సినిమాటోగ్రాఫ్ (ధ్రువీకరణ) నియమాలు-2024 ప్రకారం మహిళా ప్రాతినిధ్యానికి తగిన ప్రాధాన్యం లభించింది. అలాగే, నిబంధనలకు అనుగుణంగా చిత్రాలను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన సమీక్షా (ఎగ్జామినింగ్) కమిటీ, పునఃసమీక్షా (రివైజింగ్) కమిటీల్లో 50 శాతం మహిళలు ఉండేలా సీబీఎఫ్‌సీ చర్యలు తీసుకుంది.

సినిమాటోగ్రాఫ్ చట్టం - 1952లో పేర్కొన్న నియమాలకు అనుగుణంగా బోర్డు సభ్యుల పదవీకాలం నిర్ణయిస్తారు. సినిమాటోగ్రాఫ్ (ధ్రువీకరణ) నియమాలు 2024 ప్రకారం కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకు మూడేళ్ల పదవీకాలాన్ని మించకుండా బోర్డు సభ్యులు పనిచేస్తారు. అయితే వారి పదవీకాలం.. నూతన సభ్యుల నియామకం పూర్తయ్యే వరకు కొనసాగుతుంది.

బోర్డు సభ్యులతో సీబీఎఫ్‌సీ ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తుంది. 2017 నుంచీ ఈ-సినీప్రమాణ్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ వేదిక ద్వారా ధ్రువీకరణకు సంబంధించిన ప్రక్రియలు డిజిటల్ రూపంలోకి మారాయి. దీని ద్వారా దరఖాస్తుల సమర్పణ, విశ్లేషణ, ఆమోదం అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న సినిమాల సంఖ్య ఆధారంగా సకాలంలో ధ్రువీకరణ పూర్తయ్యేలా ఎగ్జామినింగ్, రివైజింగ్ కమిటీలు సమావేశాలు నిర్వహిస్తాయి.

సినిమా పేరు, భాష, వ్యవధి, దరఖాస్తుదారుని పేరు, నిర్మాత పేరు, సారాంశం, నటీనటులు/నిపుణుల వివరాలు వంటి ధ్రువీకరణకు సంబంధించిన ప్రాథమిక సమాచారం.. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. డేటా భద్రతకు, వ్యవస్థ విశ్వసనీయతకు హామీ ఇస్తూ, గోప్యతా నియమాలకు అనుగుణంగా.. క్యూఆర్ కోడ్ రూపంలో ఈ-సినీప్రమాణ్ పోర్టల్లో అందుబాటులో ఉంచే సమాచారంలో మార్పులు జరిగాయి. అయితే సర్టిఫికేషన్‌కు సంబంధించి ప్రజలకు అందించే సమాచారంపై ఈ మార్పులు ఎలాంటి ప్రభావం చూపించవు.

ప్రతి ఏటా వార్షిక నివేదికను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు సీబీఎఫ్‌సీ సమర్పిస్తుంది. ఈ సమాచారాన్ని మంత్రిత్వ శాఖకు చెందిన పూర్తి వార్షిక నివేదికలో పొందుపరుస్తారు. క్రమం తప్పకుండా ప్రచురించే ఈ నివేదిక మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటుంది.

రాజ్యసభలో శ్రీమతి సాగరికా ఘోష్ అడిగిన ప్రశ్నకు స్పందనగా కేంద్ర సమాచార, ప్రసారాలు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# వృద్ధులు, 45 ఏళ్ల వయసు అంతకన్నా పైబడిన మహిళలకు ఆటోమేటిక్‌గా దిగువ బెర్తుల కేటాయింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:వృద్ధులు, దివ్యాంగులతో సహా ప్రయాణికుల సౌకర్యార్థం పలు సదుపాయాల కల్పనకు భారతీయ రైల్వేలు నిరంతరం ప్రయత్నిస్తున్నాయి. వృద్ధులు, దివ్యాంగులకు కల్పించిన కొన్ని సదుపాయాల జాబితా:

ప్రత్యేకంగా ఎంచుకోక పోయినా, లభ్యతను బట్టి వృద్ధులు.. 45 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న మహిళా ప్రయాణికులకు ఆటోమేటిక్‌గా దిగువ బెర్తులు కేటాయిస్తారు.

వృద్ధులు.. 45 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న మహిళా ప్రయాణికులు, గర్భిణీలకు స్లీపర్ క్లాస్ కోచ్‌లో 6 నుంచి 7 బెర్తులు,3ఏసీక్లాస్‌లో 4 నుంచి 5, 2ఏసీ క్లాస్‌లో 3 నుంచి 4 బెర్తులు (రైలులో ఆయా తరగతుల కోచ్‌లు ఎన్ని ఉన్నాయనే దానిపై ఆధారపడి ఈ బెర్తుల సంఖ్య ఉంటుంది) ప్రత్యేక కోటా ద్వారా కేటాయిస్తారు.

రాజధాని, శతాబ్ది వంటి రైళ్లతో సహా అన్ని మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దివ్యాంగులు, వారి సహాయకులకు రిజర్వేషన్ కోటాను ఈ విధంగా అమలు చేస్తారు.

స్లీపర్ క్లాస్‌లో నాలుగు బెర్తులు (ఇందులో రెండు దిగువ, రెండు మధ్యనుండే బెర్తులు)

3ఏసీ, 3ఈ క్లాస్‌లో నాలుగు బెర్తులు (ఇందులో రెండు దిగువ, రెండు మధ్య బెర్తులు)

రిజర్వ్ చేసిన సెకండ్ సిట్టింగ్ (2ఎస్), ఏసీ చైర్ కార్ (సీసీ)లో నాలుగు సీట్లు

రైలులో ఖాళీ దిగువ బెర్తులను వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలకు (వీరికి అప్పటికే మధ్య, పైన బెర్తులు కేటాయించి ఉంటే) ప్రాధాన్యతపై కేటాయిస్తారు.

భద్రత, ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరిచేందుకు వివిధ రకాల కోచ్‌లను రూపొందించి, అభివృద్ధి చేశారు. రిజర్వ్ చేసిన కోచ్‌లలో ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలను గుర్తుల ద్వారా సూచిస్తారు. 'ప్రవేశం', 'నిష్క్రమణ'ను సూచించే బోర్డులు ప్రయాణికులు ప్రవేశించే ద్వారం వద్ద అందుబాటులో ఉంటాయి. జనరల్ కోచ్‌లలో ఏ ద్వారం నుంచైనా ప్రవేశించి, నిష్క్రమించవచ్చు.

ప్రయాణికుల సౌలభ్యం, సౌకర్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో భారతీయ రైల్వే అనేక రకాల సదుపాయాలను కల్పిస్తుంది. అవి:

దాదాపు అన్ని మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయించిన బోగీ ఉంటుంది. వెడల్పయిన ప్రవేశ ద్వారాలు, బెర్తులు, కంపార్ట్‌మెంట్లు, వెడల్పయిన ద్వారాలు గల మరుగుదొడ్లు, వీల్ చైర్ పార్కింగ్ స్థలాలతో పాటు మరుగుదొడ్ల లోపల ఆసరా కోసం పట్టుకునే చేతి కడ్డీలు, తగిన ఎత్తులో వాష్ బేసిన్, అద్దం వంటి అదనపు సౌకర్యాలుంటాయి.

దృష్టి లోపం ఉన్న ప్రయాణికుల సౌకర్యార్థం, సాధారణ సంకేతాలపై బ్రెయిలీ లిపిని జోడించి, సమగ్ర బ్రెయిలీ సంకేతాలను అందుబాటులో ఉంచారు.

దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక అమృత్ భారత్, వందే భారత్ రైళ్లను రూపొందించారు. వందే భారత్ రైలు మొదటి, చివరి కోచ్‌లలో వీల్ చైర్ కోసం ప్రత్యేక స్థలం, దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విశాలమైన మరుగుదొడ్లు ఉన్నాయి. వందే భారత్ రైలు కోచ్, అమృత్ భారత్ [illegible] లగేజీ-కమ్-దివ్యాంగుల కోచ్‌లలో సులభంగా ఎక్కటానికి, దిగటానికి వీలుగా దివ్యాంగులకు మాడ్యులర్ ర్యాంపు ఏర్పాటు చేశారు.

ఇవాళ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# హస్తకళా పురస్కారాలు- 2025: హస్తకళా రంగంలో అత్యుత్తమ ప్రతిభకు సత్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:2023, 2024 సంవత్సరాలకుగాను నిపుణులైన విశిష్ట హస్తకళాకారులకు ప్రతిష్ఠాత్మక హస్తకళా పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో 2025 డిసెంబరు 9 మంగళవారం రోజున పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తారు. జాతీయ హస్తకళల వారోత్సవాల్లో ఈ కార్యక్రమం అంతర్భాగం. అద్వితీయమైన కళాత్మక నైపుణ్యానికి గుర్తింపునివ్వడమే కాకుండా.. సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన దేశ హస్తకళా వారసత్వాన్ని సంరక్షించి, ప్రోత్సహించడంలో ప్రభుత్వ అచంచల నిబద్ధత ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాలతో స్పష్టమవుతోంది.

భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. కేంద్ర జౌళి శాఖా మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. జౌళీ, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ పబిత్రా మార్గరిటా గౌరవ అతిథిగా హాజరవుతారు.

1965లో మొదలైనప్పటి నుంచి.. దేశ సాంస్కృతిక రంగాన్ని సుసంపన్నం చేసిన అసాధారణ హస్తకళాకారులకు జాతీయ హస్తకళా పురస్కారాలు గుర్తింపునిచ్చాయి. 2002లో ప్రవేశపెట్టిన శిల్ప గురు పురస్కారాలు భారతీయ హస్తకళా రంగంలో అత్యున్నత పురస్కారంగా నిలిచాయి. హస్తకళల్లో అసాధారణ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రదర్శించిన కళాకారులను ఈ పురస్కారాలు గౌరవాన్నీ, గుర్తింపునీ ఇస్తున్నాయి. తద్వారా వైవిధ్యభరితమైన భారత హస్తకళా వారసత్వం అవిచ్ఛిన్నంగా కొనసాగేలా, కొత్త పుంతలు తొక్కేలా భరోసానిస్తున్నాయి.

ఏటా డిసెంబరు 8 నుంచి 14 వరకు నిర్వహించే జాతీయ హస్తకళల వారోత్సవం దేశ కళాకారుల సేవలను గౌరవిస్తుంది. చిరతరమైన హస్తకళల సాంస్కృతిక ప్రాధాన్యాన్ని చాటుతుంది. అవగాహనను పెంపొందించడం, హస్త కళాకారుల జీవనోపాధిని పెంపొందించడం, సమకాలీన భారత్‌లో ఈ రంగం సామాజిక-ఆర్థిక ఔచిత్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా.. ఈ వారోత్సవంలో విస్తృత శ్రేణి కార్యకలాపాలు, ప్రజా భాగస్వామ్యమున్న కార్యక్రమాలు నిర్వహిస్తారు. అసాధారణ హస్తకళా ప్రదర్శనలు, అంశాలవారీ వర్క్‌షాపులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, అవగాహన కార్యక్ర మాలు, సాంస్కృతిక ప్రదర్శనల వంటి కీలక కార్యక్రమా లుంటాయి.

దేశ సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థకు హస్తకళా రంగం మూలాధారం. ఇది శతాబ్దాల నాటి సంప్రదాయాలను సంరక్షిస్తుంది. లక్షలాది మందికి.. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో కళాకారులకు జీవనోపాధిని అందిస్తుంది. దేశ ఎగుమతుల ఆదాయానికి విశేషంగా దోహదపడుతుంది. గుర్తింపు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక కార్యక్రమాలు, ఆర్థిక సాధికారత, దేశీయ, అంతర్జాతీయ మార్కెటను మరింత మెరుగ్గా అందుబాటులోకి తేవడం ద్వారా ద్వారా హస్తకళాకారులకు అండగా ఉండేందుకు జౌళి మంత్రి త్వ శాఖ కట్టుబడి ఉంది. ఈ కార్యక్రమాలు, జాతీయ హస్తకళా వారోత్సవాల ద్వారా.. దేశ హస్తకళా వారసత్వ ఔన్నత్యాన్ని మరింత పెంచడం, హస్తకళా కారుల సంఘాలను బలోపేతం చేయడం తోపాటు ఆధునిక ప్రపం చంలో దేశ సంప్రదాయ హస్తకళలు వికసించేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## ఆదర్శ గ్రామంగా బిక్కనూర్ తీర్చిదిద్దుతా

ఆదిలాబాద్, డిసంబర్ 6: అభివృద్ధిలో బిక్కనూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి బండి చంద్రకళ రాములు అన్నారు. సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన ఆమె ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆశీస్సులతో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

తమను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఎంపీటీసీగా తమ వార్డును అభివృద్ధి చేశానని ఈసారి అవకాశమిస్తే బిక్కనూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

# సమాజంలో హోంగార్డుల సేవలు కీలకం..

-జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, డిసెంబర్ 6: జిల్లా పోలీసు వ్యవస్థలో హోం గార్డులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ రోజు తండేంవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం మైదానంలో నిర్వహించిన 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముందుగా ఎస్పీకి పరేడ్ కమాండర్ హోంగార్డ్ శశి భూషణ్ గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజింగ్ డే పరేడ్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అనంతరం శాంతి సూచకంగా బెలూన్లు, పావురాలను గాల్లోకి వదిలారు. పరేడ్‌లో 4వ ప్లాటూన్ మొదటి బహుమతి గెలుచుకుంది.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన పరేడ్ కమాండర్, ప్లాటూన్ కమాండర్, సిబ్బందికి ఎస్పీ మెడల్స్‌తో సత్కరించారు. ఇటీవల రిటైర్డ్ హోంగార్డు రమణ మూర్తికి జిల్లా వ్యాప్తంగా ఉన్న హోంగార్డు విభాగం వారి ఒక రోజు గౌరవ వేతనం 4.18 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జిల్లా ఎస్పీ అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు,డిఎస్పీ సి



హెచ్ వివేకానంద, ఏఓ సి హెచ్ గోపినాథ్, సిఐలు ఇమ్మాన్యుల్ రాజు,పైడిపు నాయుడు, ఈశ్వర రావు, అవతారం,సూర్య చంద్ర మౌళి, సన్యాసి నాయుడు, సత్య నారాయణ,ఆర్ ఐలు నర్సింగరావు, క్రిష్ణ ప్రసాద్, ఆర్‌ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వికాస్ పాఠశాలలో ఘనంగా ఫ్రూట్స్ డే వేడుకలు



మహబూబాబాద్, డిసెంబర్ 6: తొర్రూరు డివిజన్ లోని వెలికట్ట శివారులో ఉన్న వికాస్ హైస్కూల్ లో శనివారం ఫ్రూట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రకరకాల పండ్లతో అనేక రకాలుగా కుందేలు, జింక, హంస, తాబేలు, గొడుగు, తామర పువ్వు, ఎలుక, వినాయకుడు, ఆక్టోపస్, డాల్ఫిన్, పాండా వంటి అనేక రకాల ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతిరోజు పండ్లు తీసుకో వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, సీజనల్ గా లభించే పండ్లను ప్రతి ఒక్కరూ తీసుకోవా లన్నారు. ప్రతి పండులో రకరకాల పోషకాలు, విటమిన్లు మనిషికి అందుతాయని తెలిపారు. ప్రస్తుత హడావుడి జీవన విధానంలో ఫలాలు మనకు ఎంతో అవసరమని, వాటిలో ఉండే విటమిన్లు, ఫైబర్స్ మనకు ఎంతగానో ఆరో గ్యాన్ని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కేవీ రెడ్డి, శ్రీలత, ప్రిన్సిపాల్ నాగరాజు, వేణుమాధవ్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నవభారత నిర్మాత అంబేద్కర్



వరంగల్, డిసెంబర్ 6:భారత రాజ్యాంగ నిర్మాత, మహానుభావుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గ సర్కిల్ లో ఉన్నటువంటి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈసందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ మన దేశానికి రాజ్యాంగం రూపుదిద్దిన మహనీయుడన్నారు. సమానత్వం, న్యాయం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం వంటి విలువలను భారత ప్రజలకు అందించిన దార్శనిక నాయకుడు, ఆయన చూపిన మార్గం ఎప్పటికీ నిత్యనూతనంగా మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. వీరితో పాటు మాజీ మేయర్ తక్కలపల్లి రాజేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, బన్న ప్రభాకర్, సముద్రాల పరమేశ్వర్, గడల కుమార్, కందిమల్ల మహేష్, కోమాకుల నాగరాజు, మారుమూల్ల ప్రవీణ్, జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

# పొనకల్ వాడల్లో ఇంటింటా విస్తృత ప్రచారం

## -సర్పంచి అభ్యర్థిని గెలిపించాలని వినతి

మంచిర్యాలనవంబర్ 6 మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచి పరిష్కరిస్తామన్నారు. సర్పంచి అభ్యర్థిని గెలిపించినట్లయితే గ్రామ మాజీ సర్పంచి జక్కు భూమేష్ గుప్తా, టౌన్ అధ్యక్షుడు



కాంగ్రెస్ అభ్యర్థి జక్కు సుష్మ భూమేష్ తోపాటు నేతలు శనివారం మధ్యాహ్నం విస్తృతంగా ప్రచారం చేశారు. తమ సర్పంచి అభ్యర్థిని గెలిపించినట్లయితే స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పంచాయతీలోని వాడల్లో నేతలంతా ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వాడల్లో మహిళలచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్, రమేష్, నేతలు ఇసాక్, చంద్రశేఖర్, శంకర్, సుధీర్, రాజేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.




# ఈశ్వరాచారికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.. బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉషా డిమాండ్

-రిజర్వేషన్ల కోసం ఏ బీసీ బిడ్డా ఆత్మబలిదానం చేసుకోవద్దు

-ఈశ్వరాచారి త్యాగమే చివరిది కావాలి

-బీసీలను మోసం చేసే వారికి గట్టి గుణపాఠం చెప్పాలి

కరీంనగర్, డిసెంబర్ 6: బీసీల రిజర్వేషన్ల కోసం ఏ బీసీ బిడ్డ ఆత్మబలిదానం చేసుకోవద్దని, ఈశ్వరాచారి త్యాగమే చివరిది కావాలని, బీసీలను మోసం చేసే వారికి గట్టి గుణపాఠం చెప్పాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉషా డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం హైదరాబాద్‌లో ఆత్మాహుతి చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబానికి ప్రభుత్వం రూ. 1కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని శనివారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి బీసీల పట్ల జరుగుతున్న సామాజిక దాడులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల నల్గొండ జిల్లా కేంద్రంలో జనరల్ స్థానంలో పోటీకి నామినేషన్ వేసిన బీసీ అభ్యర్థి భర్త పట్ల జరిగిన అనాగరిక సంఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. అంతే కాకుండా బీసీ రిజర్వేషన్లను కోరుతూ ఈశ్వరాచారి ఆత్మబలిదానం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది ముమ్మాటికి ఆత్మహత్య కాదు.. ప్రభుత్వం చేసిన హత్యేనని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఈశ్వరాచారి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటుగా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పివారి పిల్లలకు పీజీ వరకూ ప్రభుత్వ ఖర్చులతో విద్యాభ్యాసం చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్ల పేరిట కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. బీసీ బిడ్డలు ప్రాణాలను తీసుకొని బొందలో పడటం కాదని, ఆ పార్టీలనే బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బీసీలను సంఘటితం చేస్తూ ఒక్కతాటిపైకి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని పేర్కొన్నారు. ఇందుకు గాను బీసీ బిడ్డలు ఇంటి కొకరు ఉద్యమ బాట పట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు సతేంద్ర కొమురయ్య, సిరవేని స్వప్న, మిట్టపల్లి శ్రీనివాస్, కలవేని రవి, విశ్వకర్మ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

-కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి..

-పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హైదరాబాద్, డిసెంబర్ 6:పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. శనివారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్న స్టాటిక్ సర్వేలెయన్స్ చెక్ పోస్ట్ ను సీపీ సందర్శించారు.



వాహన తనిఖీల వివరాల రిజిస్టర్ ను సీపీ తనిఖీ చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా నగదు, మద్యం, ఇతర వస్తువులను అక్రమ రవాణాకు ప్రయత్నించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది వాహనాలను తనిఖీ సమయంలో తగిన జాగ్రత్తలు రేడియం జాకెట్స్ వేసుకోవాలని, లైట్స్ అందుబాటులో ఉంచుకోవాలని స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని, ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి జోన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని చెక్ పోస్ట్ వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని సీపీ తెలిపారు. అనంతరం గర్రెపల్లి గ్రామం మేజర్ గ్రామ పంచాయతీ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ సందర్శించారు.

ముందస్తు సమాచారం సేకరించి ప్రచారం సమయంలో, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున, ఫలితాలు వెల్లడించిన తరువాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు అమలు చేయాలని, ఏ సమాచారం వచ్చినా, వెంటనే స్పందన తప్పనిసరని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై, ట్రబుల్ మాంగర్స్ పై 24/7 పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్ పాల్గొన్నారు.

# హోంగార్డ్ సేవలు వెలకట్టలేనివి.. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

## -జిల్లాలో ఘనంగా హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం

కరీంనగర్, డిసెంబర్ 6: శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డ్ సేవలు వెలకట్టలేనివని, పోలీసు సిబ్బందితో దీటుగా హోంగార్డ్స్ విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం హోంగార్డ్ ఆఫీసర్స్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించి హోంగార్డ్ ఆఫీసర్స్ నిర్వహించిన పరేడ్‌ను తిలకించి, హోంగార్డు ఆఫీసర్స్ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ హోం గార్డ్స్ వ్యవస్థ నేడు దేశవ్యాప్తంగా పోలీసు విభాగానికి బలమైన సహాయక శక్తిగా ఎదిగి, నిస్వార్థ సేవ అనే నినాదంతో ప్రజాసేవలో ముందుండి పనిచేస్తోందన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, ఉత్సవాలు, ఎన్నికల బందోబస్తు, నైట్ పెట్రోలింగ్, నేరాల నిరోధం వంటి ఏ పనిలోనైనా హోం గార్డ్స్ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల భద్రత కోసం తమ సేవలను అందిస్తున్నారన్నారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల్లోనూ విధుల్లో నిజాయితీగా పనిచేస్తున్నారని ప్రసంశించారు. జగిత్యాల జిల్లా హోం గార్డ్స్ లా అండ్ ఆర్డర్, వీఐపీ డ్యూటీలు, విపత్తు నిర్వహణ, కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లలో విశేష పాత్ర పోషిస్తున్నారన్నారు. హోం గార్డుల సంక్షేమం, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి పోలీస్ శాఖ



పూర్తి సహకారం కొనసాగిస్తూ, మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### కళాబృందం లో హోం గార్డ్స్ సేవలు ప్రత్యేకం

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడంలో కళాబృందం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని చెప్పారు. అంతేకాకుండా, షీ టీమ్స్‌తో కలిసి పాఠశాలలు, కళాశాలల్లో బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు.

### హోం గార్డుల సంక్షేమం

హోం గార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం డ్యూటీ అలవెన్స్ రూ.921 నుండి రూ.1,000కు పెంచిందని, ట్రాఫిక్ డ్యూటీలకు 30శాతం ప్యాల్యూషన్ హజార్డ్ అలవెన్స్ , పరేడ్ అలవెన్స్ రూ.100 నుండి రూ.200కు పెంపుచేయడం తో పాటు సహజ, ప్రమాద మరణాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, జిల్లాలోని అన్ని హోం గార్డులకు వూలెన్ జాకెట్లు, రెయిన్‌కోట్లు పంపిణీ చేశమన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ మెడికల్ సదుపాయం విస్తరణ, తాత్కాలిక వైద్య సదుపాయాలు-బ్యాంకుల సహకారం హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల సహకారంతో హోం గార్డుల కోసం ప్రత్యేక వైద్య బీమా పథకం అమల్లోకి వచ్చిందన్నారు.

హోంగార్డ్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన హోంగార్డ్స్ కు బహుమతుల ప్రధానం చేశారు. అనంతరం కళాబృందం ద్వారా ప్రజల్లో చైతన్యం కనుబరుస్తున్న కళాబృందం సభ్యులను ఘనంగా సన్మానించి బహుమతులు ప్రధాన చేశారు, అదేవిధంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డ్స్ ఆఫీసర్స్ కు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, సైదులు, వేణు, రిజర్వ్ ఎస్ఐలు, హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# హోంగార్డ్స్ సేవలు వెలకట్టలేనివి : ఎస్పీ నరసింహ

నల్గొండ, డిసెంబర్ 6:శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డ్స్ సేవలు వెలకట్టలేనివని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహ అన్నారు. 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హోంగార్డ్ ఆఫీసర్స్ పరేడ్ లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన పోలీసు సిబ్బందితో సమానంగా చాలా సందర్భాల్లో హోంగార్డు ఆఫీసర్స్ విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. సాంకేతిక పరంగా, సిసిటిఎన్ఎస్ గా, రైటర్స్ గా విధులు నిర్వర్తిం చడంలో హోంగార్డ్ ఆఫీసర్స్ ము ందున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోను, వరదల సమయంలోనూ కష్టపడి పని చేస్తున్నట్లు తెలిపారు. హోం గార్డ్ ఆఫీసర్ సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందన్నారు. అందులో భాగం గా వారి పిల్లల చదువుల కోసం, ఆరోగ్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి హోంగార్డ్ సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డ్ పిల్లల కు మొదటి బహుమతిగా రూ.18 వేలు, రెండో బహుమ తిగా రూ.15 వేలు, మూడవ బహు మ తిగా రూ.12 వేలు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. అదే విధంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపుతున్న వారికి మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహు మతిగా రూ.8 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డ్ ఆఫీసర్స్ కు ప్రశంసా పత్రాలు అందించి అభినం దించారు. హోం గార్డ్ ఆఫీసర్స్ తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

## -నేరడిగుంట సర్పంచ్ అభ్యర్థి ఒగ్గుసాయి కిరణ్

సంగారెడ్డి, డిసెంబర్ 6: గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని నేరడిగుంట పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఒగ్గసాయి కిరణ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం నేరడిగుంటలో ఆంధ్రప్రభ బ్రోచర్ ను ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే గ్రామస్తుల కోసం తాను కొత్త పథకాలు అమలు చేసేందుకు సొంత మేనిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. గ్రామస్తులు తమ అమూల్యమైన ఓటును నిజమైన సేవకుడిగా పనిచేసే తనకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# గిరిజనులకు కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయం : కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 6:బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ రచించిన "గిరిజనుల ఆత్మబంధువు" పుస్తకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. గిరిజన జాతి కోసం కేసీఆర్ చేసిన సేవలను పుస్తక రూపంలో తీసుకువచ్చిన శ్రీను నాయక్‌ను కేటీఆర్ అభినందించారు.

గిరిజనులకు కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కేటీఆర్ కొనియాడారు. తండాలను, గూడాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి, గిరిజనుల జనాభా పెరిగిన దృష్ట్యా గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను కల్పించి, గిరిజనులకు పోడు భూములపై హక్కులను కల్పించే విధంగా పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చి వాటికి రైతుబంధు పథకాన్ని అనువర్తింపజేయడం ఈ విధంగా ఎన్నో ఏండ్ల గిరిజన కలలను సాకారం చేసిన స్వాప్నికుడు కేసీఆర్ సేవలను ఈరోజు తండాలలో గూడాలలో గిరిజన జాతి గుర్తుపెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

అదేవిధంగా గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలు, సీఎం ఎస్టీఈఐ పథకం, గిరి వికాస్, గిరి పోషణ, హైదరాబాద్ నడిబొడ్డున ఆత్మగౌరవ భవనాల నిర్మాణం వంటి వినూత్నమైన కార్యక్రమాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. గిరిజన తండాలు, గూడాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన రోజు ఆగస్టు 2వ తేదీ నాడు అన్ని గిరిజన గ్రామాలలో గిరిజన సంబురం కార్యక్రమాన్ని నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్, రావుల చంద్ర శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

# జాతి నిర్మాణానికి తోడ్పడండి

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి శ్రీ పియూష్ గోయల్ ఈరోజు నోయిడాలోని అమిటీ విశ్వవిద్యాలయం వార్షిక స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ, ప్రతిభావంతులైన మనస్సులను తిరిగి రావడానికి ప్రోత్సహించడం, వారి సామర్థ్యాలను పెంపొందించుకోవడం మరియు వారి సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించే వేదికను అందించడం కంటే విశ్వవిద్యాలయం గొప్ప సహకారం మరొకటి ఉండదని అన్నారు. ఆన్‌లైన్ మరియు క్యాంపస్ అభ్యాసకులతో సహా దాదాపు 29,000 మంది విద్యార్థుల గ్రాడ్యుయేషన్ బ్యాచ్‌ను అభినందిస్తూ, విద్యార్థులు మరియు అవార్డు గ్రహీతల విజయాలు ఈ వేడుక యొక్క నిజమైన దృష్టి అని మంత్రి అన్నారు.

విద్యార్థులకు అందించే విస్తృత అవకాశాలను శ్రీ గోయల్ హైలైట్ చేశారు మరియు అవసరం లేని ప్రవేశాలకు వీలు కల్పించే స్కాలర్‌షిప్‌ల ద్వారా మెరిట్ పట్ల విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను ప్రశంసించారు. విద్యార్థి జనాభాలో సగం మంది యువతులు ఉన్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు మరియు విశ్వవిద్యాలయం యొక్క బలమైన ఆవిష్కరణ సంస్కృతిని ప్రశంసించారు, 450 కి పైగా విద్యార్థులు పేటెంట్లను కలిగి ఉన్నారు. 50 మంది అధ్యాపక సభ్యులు దేశానికి సేవ చేయడానికి తిరిగి వచ్చిన రామలింగం స్వామి ఫెలోలు అనే వాస్తవాన్ని కూడా ఆయన గమనించారు.

మహాపరినిర్వాన్ దివాస్ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారసత్వాన్ని గుర్తుచేసుకుంటూ, సమానత్వం, సామాజిక సామరస్యం మరియు అందరికీ అవకాశాలు అనే రాజ్యాంగ విలువలను మంత్రి పునరుద్ఘాటించారు. విద్య అనేది వెనుకబడిన వర్గాలను ఉద్ధరించడానికి పునాదిగా మిగిలిపోయిందని మరియు సమాజం మరియు దేశం పట్ల విద్యార్థులకు వారి విధులను గుర్తుచేశారని ఆయన నొక్కి చెప్పారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం వైపు భారతదేశం యొక్క ప్రయాణంలో గ్రాడ్యుయేటింగ్ కోహోర్ట్ ఒక ముఖ్యమైన భాగంగా మంత్రి అభివర్ణించారు, రాబోయే 25 సంవత్సరాలు విక్షిత్ భారత్‌కు నిర్ణయాత్మక యుగం అవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని, సరిహద్దులను అధిగమించాలని మరియు జాతీయ పురోగతికి అర్థవంతంగా దోహదపడాలని ఆయన కోరారు.

ఎర్రకోట ప్రాకారాల నుండి ప్రధానమంత్రి తన ప్రసంగంలో, ప్రజా జీవితాన్ని మరియు రాజకీయాలను ఒక వృత్తిగా పరిగణించాలని లక్ష మంది యువకులు మరియు మహిళలు విజ్ఞప్తి చేశారని ఆయన హైలైట్ చేశారు. దేశం కోసం పనిచేయడానికి, ప్రజా జీవితంలో సమగ్రతను కాపాడుకోవడానికి మరియు దేశంలోని 140 కోట్ల మంది పౌరులు తమ బాధ్యతలు మరియు విధులను గుర్తించేలా ప్రేరేపించడానికి ఇష్టపడే నిబద్ధత కలిగిన వ్యక్తులు రాజకీయాలకు అవసరమని ఆయన అన్నారు – మొదట వారి కుటుంబాలకు, తరువాత సమాజానికి, చివరికి దేశానికి.

ప్రజా జీవితాన్ని, రాజకీయాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించడానికి మరిన్ని విశ్వవిద్యాలయాలు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమిటీ విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్రాన్ని ఒక సబ్జెక్టుగా అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. పాలన మరియు ప్రజా సేవను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి, ఒకరోజు వారు దానిని మరింత మెరుగ్గా ఎలా చేయగలరో అర్థం చేసుకోవడానికి, ఎన్నికైన ప్రతినిధులతో విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు పంపడాన్ని కూడా సంస్థలు పరిగణించవచ్చని ఆయన సూచించారు.

తన తొలి కంప్యూటర్ పాఠాలలో బోధించినట్లుగా, "చెత్తను లోపలికి పంపు, చెత్తను బయటకు పంపు" అని ఆయన వ్యాఖ్యానించారు మరియు భారత రాజకీయాలకు మరింత మంచి వ్యక్తులు మరియు బలమైన ప్రజా నాయకులు అవసరమని అన్నారు. మరింత మంచి ఉద్దేశ్యంతో ఉన్న యువకులు మరియు బాలికలు ప్రజా జీవితంలోకి చేరితే, భారతదేశం ఎవరూ ఊహించిన దానికంటే వేగంగా సూపర్ పవర్‌గా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశ భవిష్యత్తు "సాధ్యమైన తరం" చేతుల్లో ఉందని ప్రధానమంత్రి పదే పదే చెప్పారని, యువత కొత్త భారతదేశాన్ని నిర్మిస్తారని ఆయన అన్నారు.

## రావిపహాడ్ తండా సర్పంచ్‌గా బానోత్ శంకర్ నాయక్ ఏకగ్రీవం

నల్గొండ,డిసెంబర్ 6:బీబీ నగర్ మండలంలోని రావిపహాడ్ తండా సర్పంచ్‌గా బానోత్ శంకర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శంకర్ నాయక్ ను భువనగిరి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పైళ్ల శేఖర్ రెడ్డి శాలు వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధికి నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేస్తూ గ్రామాభివృద్ధికి పాటుపడనున్నట్లు తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర ముఖ్యమైంది..

### -జిల్లాలో హోంగార్డ్‌ల పనితీరు ప్రశంసనీయం
### -అడిషనల్ ఎస్ పి ఎన్. వెంకటేశ్వర్లు

నాగర్ కర్నూల్,డిసెంబర్ 6: నాగర్ కర్నూల్ జిల్లాలో 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల




జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించారు. హోం గార్డ్ సిబ్బంది 63వ రైజింగ్ డే సందర్భంగా పరేడ్ గ్రౌండ్లో పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు.

ఈ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవ ప్రోగ్రాంలో భాగంగా అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డుల పనితీరు బాగుందని ప్రశంసించారు. జిల్లాలో మొత్తం 175 మంది హోంగార్డులు ఉన్నారని మంచి పనితీరును కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందించడంతో పాటు వారు హోంగార్డ్ దినోత్సవం సందర్భంగా క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది.

అలాగే తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ నుండి హోంగార్డులకి కూడా ఇన్సూరెన్స్ లతో పాటు యూనిఫామ్ అలవెన్స్ ఇస్తున్నామని. అలాగే హోంగార్డ్ సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ఇటీవలే యాక్సిస్ బ్యాంక్ బ్యాంకుతో సంప్రదింపులు జరిపామని త్వరలోనే సిబ్బంది.. అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ఉండే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాసులు,సిఐ అశోక్ రెడ్డి, ఆర్ ఐ జగన్, రాఘవరావు,ఎస్సై గోవర్ధన్, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆర్ఎస్ఐ గౌస్ పాషా,ప్రశాంత్, కళ్యాణ్,శివాజీ లతోపాటు హోంగార్డ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## సాయి ఈశ్వరచారి మృతికి కాంగ్రెస్, బీజేపీలే బాధ్యత వహించాలి : వేణుగోపాల్ గౌడ్

హన్మకొండ, డిసెంబర్ 6 బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీలు బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే ఆవేదనతో మనస్థాపం చెందిన బీసీల ముద్దుబిడ్డ సాయి ఈశ్వంచారి ఆత్మ బలిదానం చేసుకున్నాడని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేసారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లో దివంగత సాయి ఈశ్వరచారికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ సాయిఈశ్వరా చారి మృతికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలే నైతిక బాధ్యత వహించాలన్నారు.

ఇది ముమ్మాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హత్యగానే బీసీ సమాజం పరిగణిస్తుందన్నారు. హత్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరాచారి మృతితోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగం ద్వారా 9వ, షెడ్యూల్లో నేర్పించి, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని వెంటనే సర్పంచ్ ఎన్నికలను నిలిపివేయకుంటే, బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సాయి ఈశ్వరాచారి ఆత్మ త్యాగంతోనైనా కాంగ్రెస్, బిజెపి పార్టీలలోని బీసీ నేతలంతా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బిసి జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరిగౌడ్, జిల్లా స్వర్ణకార సంఘ ఉపాధ్యక్షలు కొత్తగట్టు వీరబ్రహ్మాచారి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెందోట చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శులు పొడిచెట్టి విష్ణువర్ధన్, కట్కోజ్వల సత్యనారాయణ, జక్కోజు కోటేశ్వర్‌రావు, స్వర్ణకార సంఘం నాయకులు, కార్యకర్తలు పానుగంటి రవీందర్, ఆసం రవి, మధు, శ్రీను, శ్రీధర్, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

## బాబా సాహెబ్ ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మహబూబ్‌నగర్, డిసెంబర్ 6: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కం కృషి వల్లే చిన్న రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో పలుచోట్ల నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, అసమానతలు లేని సమాజం కోసం చేసిన పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. బాబాసాహెబ్ ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అరి అన్నారు.

## కోదాడ కోర్టులో వసతుల కల్పనకు చర్యలు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మి



నల్గొండ, డిసెంబర్ 6: కోదాడ కోర్టులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మిశారద తెలిపారు. శనివారం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్‌తో కలిసి కోదాడ కోర్టు భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అదేవిధంగా ప్రస్తుత కోర్టు హాల్స్, నూతన కోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కోదాడ కోర్టులో కనీస సౌకర్యాలు లేకుండా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారుల కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. ఇరుకైన గదుల్లో కోర్టుల నిర్వహణ చాలా ఇబ్బందులతో కూడుకుని ఉందన్నారు.

అందుకోసం నూతన భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి, తక్కువ సమయంలో బిల్డింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అప్పటివరకు చిన్నచిన్న రిపేర్లు చేయించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. భవన నిర్మాణం కోసం జిల్లా కోర్టు వైపు నుండి ఒక కమిటీ వేసి పనుల పర్యవేక్షణ చూస్తామన్నారు. వి.వి లకు ఒక రూమ్, కక్షిదారులు నిలబడేందుకు, నీడ కోసం ఒక షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కోదాడకు జిల్లా అదనపు న్యాయస్థానం ఇవ్వాలని, మోతె మండలంను కోదాడ కోర్టుల పరిధిలో కలపాలని, నాలుగు కోర్టులకు సరిపడా స్టాఫ్‌ను కేటాయించాలని బార్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తిని పరిశీలిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.రాధాకృష్ణ చౌహాన్, సీనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, జూనియర్ సివిల్ జడ్జిలు కె.భవ్య, ఎం.డీ ఉమర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, హుస్సేన్, నవీన్, చలం, ధనలక్ష్మి, రమేశ్, సీనియర్ న్యాయవాదులు వై.సుధాకర్ రెడ్డి, మేకల వెంకటరావు, దేవబత్తిని నాగార్జున రావు, పాలేటి నాగేశ్వరరావు, గట్ల నర్సింహారావు, కొండల్ రెడ్డి, ఈదుల కృష్ణయ్య, సాధు శరత్ బాబు, వి.రంగారావు, నాళం రాజయ్య, సంపేట సుధాకర్, రహీం, రామిరెడ్డి, ఏ.పి.పి.లు గౌస్ పాషా, కారింగుల కళ్యాణి, ఆర్ అండ్ బి అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## స్క్రబ్ టైఫస్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించండి

### -వైద్య సిబ్బంది ని అప్రమత్తం చేయండి

నంద్యాల,డిసెంబర్ 6: నల్లి, ఇతర కీటకాల ద్వారా సంక్రమించే స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్ లో స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెం ట్ మల్లీశ్వరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖది కారి రాగిరి వెంకటరమణ రాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు శ్రీనివాసరావు రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాకుండా గ్రామ ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జ్వరం లక్షణాలు కనబడిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించేలా జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వ్యాధి నివారణలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమైనందున ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలన్నారు. పొలాలు, గడ్డి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పూర్తిచేతుల చొక్కాలు, పూర్తి ప్యాంట్లు, మూసివున్న బూట్లు ధరించి జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

స్క్రబ్ టైఫస్.. వ్యక్తి నుంచి వ్యక్తికి పాకదని, ఇది పూర్తిగా చిగ్గర్ కాటు ద్వారా మాత్రమే వస్తుందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జ్వరం ఎక్కువ రోజులు కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే సంప్రదించి అవసరమైన చికిత్స పొందేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..

### -సురక్షిత ప్రయాణం చేయండి
### -భీమవరంలో 3కే రన్ లో కలెక్టర్ నాగరాణి



భీమవరండ, డిసెంబర్ 6: యువత దేశానికి దిశా నిర్దేశమని, అదే స్థాయిలో ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి సురక్షితమైన వాహన చోదన ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ రోజు బీవీ రాజు కూడలి నుంచి ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పై అవగాహన 3 కే రన్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ బి.శివన్నా రాయణ రెడ్డి, పెద్ద ఎత్తున కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు, ప్రజలు, అథ్లెటిక్స్, వాకర్స్ అసోసియేషన్స్ పాల్గొన్నారు. త్రీ కే రన్ జువ్వలపాలెం రోడ్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు కొనసాగింది. సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో సాగిన త్రీ కె రన్ లో వందలాదిమంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డ్లు ప్రదర్శిస్తూ, రహదారి భద్రత మన అందరి బాధ్యత, హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ, అధిక వేగం పొంచిఉన్న ప్రమాదం, ట్రిపుల్ రైడింగ్ చేయరాదు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదం, మద్యం సేవించి వాహనం నడపరాదు అనే స్లోగన్లతో పట్టణ ప్రాంతమంతా మారుమోగింది.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఒక ప్రాణాన్ని కోల్పోతే వారి కుటుంబమే కాకుండా, ఎన్నో కుటుంబాలపై దాని ప్రభావం ఉంటుందని, ట్రాఫిక్ నిబంధనలను ప్రజలు, ముఖ్యంగా యువత తప్పనిసరిగా పాటించి సురక్షితమైన చోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్ పాటించడంతోపాటు, ఫిట్ ఇండియా స్ఫూర్తితో ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ.. యువత, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మరొకరికి ఆదర్శంగా ఉండాలని, అప్పుడే ప్రమాదాలను నియంత్రించగలమన్నారు. హెల్మెట్ ధరించకపోతే రూ.1000, అతివేగంతో వాహనాలను నడిపితే రూ.1000, ట్రిపుల్ రైడింగ్ రూ.1,500, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.1,500, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని, అలాగే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన జీవనానికి దోహదపడుతుందన్నారు. మన వాహన ప్రయాణం రోడ్డుమీద నడిచేవారికి ప్రమాదకరంగా ఉండకూడదు అన్నారు. త్రీ కే రన్ ప్రారంభానికి ముందు "ఫిట్ ఇండియా" కాన్సెప్ట్ తో శారీరక దారుణ్యంపై అవగాహన కల్పించేందుకు విష్ణు కాలేజీ విద్యార్థులు లఘు ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకున్నది.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, భీమవరం ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, జిల్లా రవాణా అధికారి కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఏ.రాంబాబు, డీపీఓ ఎం. రామ్నాథ్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్, డీఈవో ఇ.నారాయణ, డీఎస్డీవో దాసు, ఎల్డీ ఎం ఏ.నాగేంద్ర ప్రసాద్, ఎంహెచ్ఓ సోమశేఖర్, రెడ్ క్రాస్ ప్రతినిధి గోపిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.




## తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు

ఆదిలాబాద్, డిసెంబర్ 6:మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడీతండా(డీ) గ్రామ శివారులో శనివారం గుడుంబా స్థావరాలపై దేవాపూర్ ఎస్సై గంగారాం, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా గుడుంబా తయారు చేస్తున్నారని తెలుసుకొని ఆకస్మికంగా దాడులు చేశారు.

ఈ తనిఖీల్లో 1,500 వందల లీటర్ల బెల్లం పానకాన్ని , సామగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు.

## జిల్లా కోర్టు స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి

కరీంనగర్, డిసెంబర్ 6: పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని రాఘవాపూర్ జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ సందర్శించారు. ఈసందర్భంగా సర్వే నెం.1072లో కేటాయించిన పది ఎకరాల స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. స్థలం వివరాలు, భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను స్థానిక న్యాయమూర్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హైకోర్టు జడ్జిలు పుల్ల కార్తీక్, శ్రీనివాసరావు, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునిత కుంచాల, ఆర్డీవో గంగయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్, నాయవాదులు ఉన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కొనసాగించాలి

## -బీసీ సాధికారిత సంఘం నేతలు కొండ దేవయ్య, పోలాస నరేందర్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6:(నేటినిజం ప్రతినిధి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత,భారత రత్న దళిత,బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ వర్ధంతి నిశనివారం బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ అధ్యక్షులు పోలాస నరేందర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుడు రాజ్యాంగ నిర్మాత బి.అర్. అంబేద్కర్అని గుర్తు చేశారు. న్యాయ శాస్త్రజ్ఞుడు, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, కార్మిక కేంద్ర మంత్రిగా, కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఎంతో సమర్థవంతంగా పని చేశారని కొనియాడారు. స్త్రీల, దళితుల రాజకీయ స్వేచ్ఛ, రాజకీయహక్కులను సమర్థిస్తూ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం కొండ దేవయ్య మాట్లాడుతూ బాంబే హైకోర్టులో వకీలుగా పనిచేస్తూనే దళితుల విద్యావ్యాప్తికి, సామాజిక ఆర్థిక ప్రగతికి, ఉన్నతీకంణకు పనిచేశారని అన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాలు, అట్టడుగు వర్గాల, దారిద్రరేఖకు దిగువనున్న వర్గాలుయ ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా, రాజకీయంగా ఎదుగుదల చేంద్దాలన్న లక్ష్యంతో ముందు కెళ్లాలని, వారి అడుగు జాడల్లో నడవాలని,వారి సిద్ధాంతాలను, ఆదర్శాలను,ఆశయాలను రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు కొనసాగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉయ్యాల భూమయ్య,కనపర్తి హమ్మాండ్లు, చింతలకోటి రామస్వామి గౌడ్,బుర్ర దశ గౌడ్, కాసర్ల టీవీ శ్రీనివాస్,గోగికారి రాజు, గోగికారి రాజేష్,నాయి బ్రాహ్మణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ చేతులమీదుగా భీమన్న ఫార్మసీ ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ లో నూతనంగా ఏర్పటుచేసిన భీమన్న మెడికల్ ఫార్మసీ నీ శనివారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని కోరారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రె పార్టీ నాయకులు సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంట్ లో ప్రస్తావించిన ఈటల రాజేందర్

న్యూఢిల్లీ డిసెంబర్ 5 (ఎక్స్ ప్రెన్ న్యూన్ );మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై నేడు పార్లమెంట్ లో ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ ప్రస్తావించారు.40 లక్షల ఓటర్లతో 70 లక్షల జనాభా కలిగిన మల్కాజిగిరి పార్లమెంట్ లోని జవహర్ నగర్ లో 40 ఏండ్ల కిందట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు అప్పుడు ఒకటి రెండు చెత్త వాహనాలు వచ్చి చెత్త వేసేవి కానీ ఇవాళ 10వేల టన్నుల చెత్తను ఒకే చోట వేస్తున్నారు. 30 కి.మీ. చుట్టూ అక్కడ నివసిస్తున్న లక్షల మంది ప్రజలు డంపింగ్ యార్డ్ నుండి వచ్చే దుర్వాసన, కీటకాల వల్ల చాలా మంది అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఒకే చోట ఇంత పెద్ద డంపింగ్ యార్డ్ ఉండొద్దని 1.5 కోట్ల జనాభా ఉన్నా హైదరాబాద్ నగరంలో నాలుగు మూలల డంపిగ్ యార్డ్లు ఏర్పాటు చేయాలని 2017 నుండి చాలాసార్లు చెన్నైలో ఉన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. అయినా ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం చూపలేదు.గౌరవ పర్యావరణ శాఖ మంత్రిగారు ఈ సమస్యను వారి దృష్టిలో పెట్టుకొని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును త్వరగా అమలు చేసి మా జవహర్ నగర్ మరియు చుట్టూ ప్రాంతాల ప్రజలను ఈ సమస్య నుండి దూరం చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

# కనుమరుగు అయిన ఫుట్బాల్ క్రీడకు పునర్జీవం

## -సీఎం క్రీడా స్ఫూర్తికి తెలంగాణ రైసింగ్ విజన్ 2047 నిదర్శనం




హైదరాబాద్, డిసెంబర్ 6:సీఎం క్రీడా స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రైసింగ్ విజన్ 2047 ఫుట్బాల్ ఆటకు పునర్జీవం ఒకప్పుడు 1958 నుండి 19 80 వరకు హైదరాబాద్ క్రీడాకారులు చాలామంది ఫుట్బాల్ చాటారు అనంతరం కనుమరుగు అయిన ఫుట్బాల్ క్రీడకు పునర్జీవం పోయాలని మంచి సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి గారు లియోమెసి ప్రపంచ క్రీడాకారులని ఈనెల 13 న హైదరాబాద్ రావడం భారతదేశ ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ప్రపంచ పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టాలని 2047 గ్లోబల్ సమ్మేట్ తో తెలంగాణకు నూతన అవకాశాలు ద్వారాలు తెరిచిన రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అంతర్జాతీయ వేదిక పై నిలిపే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు అభివృద్ధి పెట్టుబడులు ఇన్నోవేషన్ ప్రతి రంగాలలో గేమ్ చేంజర్ గా మారుతుంది వరంగల్ గ్రేటర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అన్నారు ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శ పోలేపాక ప్రసాద్ జేర్హాన్ బొల్లం మధు సోలా విజయ్ ఎర్రకోట రామచందర్ మాగంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం..!

## -అవినీతి నిర్మూలన పై అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్




సంగారెడ్డి, డిసెంబర్ 06 (నేటి నిజం ప్రతినిది) అవినీతి రహిత సమాజానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు.

శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేటు లోని తన చాంబర్లో అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతి తీవ్రమైన నేరమని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ లంచం ఇవ్వకూడదని అన్నారు. లంచం తీసుకోవడం నేరమని అన్నారు. ప్రజలు ధైర్యంగా అవినీతి పై నిలదీయాలని సూచించారు.

"Real Heroes Don't Pay Bribe", "Corruption is a Crime, Not a Shortcut", "Speak Up, Stand Tall, Stop Corruption" వంటి సందేశాలతో కూడిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఎవరైనా అవినీతి ఘటనలను గమనించిన వెంటనే 1064 హెల్ప్లైన్కు సమాచారం అందించాలని కోరారు. అవినీతి రహిత పాలనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా సమాజంలో పారదర్శకతకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో అవినీతి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు డి.ఎస్.పి. కె. సుదర్శన్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వెస్పో ట్రస్ట్ సేవలకు ఘనమైన గుర్తింపు




హైదరాబాద్ డిసెంబర్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ 80 గాంధీనగర్ లో 2000 సంవత్సరంలో స్థాపించబడి, గత 25 సంవత్సరములుగా నిరంతరముగా వృద్ధులకు, బాలలకు, మహిళలకు వివిధ సామాజిక సేవలు అందజేస్తున్న శ్రీ పరాశరి మహిళా సేవా సంస్థ వారు తమ రజతోత్సవ ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా జరుపుకున్నారు. తమ సంస్థ 25 సంవత్సరములు పూర్తి చేసి రజితోత్సవాలు జరుపుకోవడం తమకెంతో ఆనందదాయకమని సంస్థ అధ్యక్షురాలు రామలక్ష్మి మోచర్ల తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన 25 మంది ఉద్ధండులను గౌరవించడం తమకు మరింత ఆనందాన్ని కలుగజేసింది అని ఆమె తెలిపారు. కార్యక్రమానికి అతిధులుగా శలాక రఘునాథ శర్మ, ఎస్కే జయచంద్ర ఐపీఎస్, డాక్టర్ బిక్కి కృష్ణ, డాక్టర్ వోలేటి పార్వతీశం, డాక్టర్ ముక్తేవి భారతి, డాక్టర్ కళా జనార్ధన్ మూర్తి, డాక్టర్ జల్దీ విద్యాధర్, డాక్టర్ జ్యోత్స్నారావు, ఆచార్య త్రిమూర్తుల గౌరీ శంకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా వెస్పో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు ను అతిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బంగారు తాతారావు మాట్లాడుతూ తాము, తమ సహచరులు 2017 లో స్థాపించిన వెస్పో ట్రస్ట్ రెండు తెలుగు రాష్ట్రాలలో పేదవారికి వివిధ సామాజిక సేవలు అందచేస్తూ, ఇప్పటికి ఎనిమిదిన్నర సంవత్సరాలు పూర్తి చేసుకుని, త్వరలో కోటి రూపాయల టర్నోవర్ అధిగమించబోతున్న శుభ తరుణంలో, తమ సామాజిక సేవలను గుర్తించి, గౌరవించిన పరాశరి మహిళా సేవా సంస్థ కమిటీ వారికి మరియు సంస్థ అధ్యక్షురాలు రామలక్ష్మి మోచర్ల గారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# అమెరికా అగ్ని ప్రమాదంలో హైదరాబాద్ యువతి మృతి

హైదరాబాద్, డిసెంబర్ 6: అమెరికాలో జరిగిన అగ్ని ప్రమాదంలో హైదరాబాద్ యువతి కన్నుమూసింది. భారతీయ కాలమానం ప్రకారం గురువారం రాత్రి అల్బనీ ప్రాంతంలోని ఓ అపార్ట్మెంట్ కాంప్లెక్స్లో జరిగిన అగ్నిప్రమాదంలో సహజా రెడ్డి మంటల్లో చిక్కుకుని మరణించింది. ఆమె మరణవార్తను హైదరాబాద్ జీడిమెట్లలో నివాసం ఉంటున్న ఆమె తల్లిదండ్రులకు అమెరికా అధికారులు సమాచారం అందించారు.

జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలం సముద్రాల ప్రాంతం గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి హైదరాబాద్లోని టీసీఎస్లో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేసున్నారు. ఆయన భార్య శైలజ బచ్చన్నపేట మండలంలో ఎస్జీటీగా పనిచేశారు. ఇటీవల డిప్యూటేషన్పై హైదరాబాద్కు వచ్చారు. కొన్నాళ్లుగా ఈ కుటుంబం హైదరాబాద్ జీడిమెట్లలోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటోంది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సహజా రెడ్డి కొంతకాలం కిందట ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లింది. అల్బనీ ప్రాంతంలోని ఒక అపార్ట్మెంట్లో స్నేహితులతో ఉంటుంది. అయితే గురువారం రాత్రి సహజారెడ్డి ఉంటున్న అపార్ట్మెంట్ పక్కనున్న మరో భవనానికి మంటలు అంటుకున్నాయి.

# 'క్లెయిమ్' ప్రక్రియను సజావుగా, వేగంగా చేయడం లక్ష్యం




హైదరాబాద్, డిసెంబర్ 6: 'క్లెయిమ్' ప్రక్రియను సజావుగా, వేగంగా చేయడం తమ లక్ష్యమని పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సీఈఓ సర్బవీర్ సింగ్ తెలిపారు. హైదరాబాద్లో పాలసీబజార్ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' నాలుగో ఎడిషన్ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాలిసీబజార్ కస్టమర్లు, నాన్-కస్టమర్లు ఇద్దరూ తిరస్కరణకు గురైన, నిలిచిపోయిన క్లెయిమ్లను పాలిసీబజార్ సహాయంతో మంజూరు చేయించుకున్న ఆశాజనక అనుభవాలు పంచుకున్నారు.ఈ కథలన్నీ పాలిసీబజార్ 'సూపర్ హీరోలు' అచంచలమైన పట్టుదల, నిబద్ధతతో పాటు మా ఇన్సూరర్ భాగస్వాముల సహకారంతో సాధ్యంచేశారు. వీరందరినీ 'ఇన్సూరెన్స్ కా సూపర్ హీరో' అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ కష్టపడి సంపాదించిన డబ్బును ప్రీమియంగా చెల్లిస్తారన్నారు. అవసరానికి అందుతాయని ఆశిస్తారన్నారు. సాంకేతిక సమస్యల్లో చిక్కుకుపోవడాన్ని హర్షించరన్నారు. ప్రతి క్లెయిమ్ మా దృష్టిలో ఒక కుటుంబం దురదృష్టకర పరిస్థితిని, ఆసుపత్రి చేరికను, పెరుగుతున్న వైద్య ఖర్చులను సూచిస్తాయన్నారు. ఆ భారాన్ని తగ్గించడమే ఆరోగ్య బీమా ఉద్దేశమన్నారు. క్లెయిమ్ సమాధాన్ దివస్ వంటి కార్యక్రమాలు, ఫీల్డ్లో పని చేసే ప్రత్యేక క్లెయిమ్ సహాయక బృందాల ద్వారా వేల సంఖ్యలో నిలిచిపోయిన కేసులను మళ్లీ తెరవడం, కోట్ల రూపాయల విలువైన క్లెయిమ్లను విజయవంతంగా ప్రాసెస్ చేయడం వంటి కీలక సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యలు వినియోగదారుల నమ్మకాన్ని మరింతగా పెంచిందన్నారు. క్లెయిమ్ ప్రాసెసింగ్లో ఉన్న ప్రమాణాలు మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని చెప్పారు. ఏ క్లెయిమ్ అన్యాయంగా తిరస్కరించబడకుండా లేదా నిలిచిపోకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా కస్టమర్ మురళి తన అనుభవాన్ని పంచుకున్నారు. 'నా తండ్రికి స్టేజ్?4 క్యాన్సర్ ఉంది, 30కి పైగా హాస్పిటలైజేషన్లు జరిగాయి. మొదట మా క్లెయిమ్ తిరస్కరించబడింది. వెంటనే పాలసీబజార్ రంగంలోకి దిగింది. అవసరమైన పత్రాలు సేకరించింది. ప్రతి దానిని ఆమోదం పొందేలా చూసింది. పాలసీలోని అన్లిమిటెడ్ రిస్టోరేషన్ వల్ల రూ.1.2 కోట్లకు పైగా ఖర్చైన చికిత్సలో అందులో 25 ఖరీదైన ఇమ్యూనోథెరపీ సెషన్లు కూడా పూర్తిగా కవరయ్యేలా చూసింది' అని తెలిపారు. ఈ సందర్భంగా మరొక కస్టమర్ మారెళ్ల శ్రీనివాసరావు తన అనుభవాన్ని పంచుకున్నారు. 'నాకు అక్యూట్ ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ వచ్చింది. అకస్మాత్తుగా ఎవల్యూషన్, సర్జరీ కోసం దాదాపు ఆరు లక్షలు అవసరం అయింది. రాత్రి సమయంలో ఆలస్యంగా పాలసీబజార్కు సమాచారం ఇచ్చినా వాళ్ల బృందం వెంటనే స్పందించింది. ఇన్సూరర్తో సమన్వయం చేస్తూ నాకు మార్గనిర్దేశం చేసింది. నిరంతర ఫాలోఅప్స్తో ప్రాథమిక, తుది క్లెయిమ్లు రెండూ త్వరగా ఆమోదం పొందాయి. ఆ అత్యవసర సమయంలో సజావుగా డిశ్చార్జ్ అయ్యేలా చూశారు' అని పేర్కొన్నారు.

# డిసెంబర్ 14వ తేదీన అల్ఫోర్స్ మ్యాథ్ ఒలింపియాడ్ పరీక్ష




కరీంనగర్, డిసెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి) :శ్రీనివాస రామానుజన్ భారతదేశంలోని శాస్త్రవేత్తల్లో అత్యుత్తమవారని, వారు చేసిన కృషి ఎంతో మందికి మార్గదర్శకమని మరియు ఆదర్శనీయమని విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి "అమాట్-2025" గోడ ప్రతి ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామానుజన్ స్మృతిలో ఈనెల 14వ తేదీన తెలంగాణలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 3 నుండి 10 తరగతి సీబీఎస్ఈ - స్టేట్ - ఐసిఎస్ఇ విద్యార్థులకు చాలా గొప్పగా, స్ఫూర్తిదాయకంగా "అమాట్" పరీక్షను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 14వ తేదీన ఉదయం 10 నుండి 11 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామని, ఈ పరీక్ష 100 మార్కులతో, ప్రతి సరియైన జవాబుకు 4 మార్కులు, తప్పు జవాబుకు -1 మార్కు ఉంటుందని చెప్పారు. ప్రతి తరగతిలో మొదటి 20 స్థానాలలో ఉన్న విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని అన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 5,000, 3,000, 2,000 నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను ప్రదానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విజేతలందరికీ ఈనెల 22వ తేదీన చాలా గొప్పగా నిర్వహింపబడే రామానుజన్ జయంతోత్సవాలలో, జాతీయ గణిత దినోత్సవాల్లో అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయుడం జరుగుతుందన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతిభ గల వారందరూ సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆసక్తి గలవారు ఈనెల 12లోగా పేరు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. వివరాలకు 92469 34441,92469 34456, 9398230614 నందు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శాంతి, ప్రజా భద్రతలలో హోంగార్డు అధికారుల పాత్ర కీలకం

## -జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6:(నేటినిజం ప్రతినిధి): హోంగార్డుల పనితీరు ప్రశంస నీయమని,విధి నిర్వహణలో హోంగార్డుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పేర్కొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల సందర్భంగా హోంగార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈపరేడ్ కి జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని, హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని, ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోమ్ గార్డ్స్ అధికారులు, సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, హోమ్ గార్డ్ సిబ్బంది ప్రతి డ్యూటీని బాధ్యతగా నిర్వహించే వారి క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి పోలీస్ శాఖకు గర్వకారణం అన్నారు.విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంస పత్రాలు, మెమోంటోస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సిఐలు కృష్ణ, మొగిలి, నాగేశ్వరరావు, రవి, ఆర్ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com